ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
శనివారం 18 జులై 2026 సంపుటి: 1 సంచిక: 31 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు
## ఈసీకి లేదు
ఓటు లేకుంటే పౌరసత్వం లేనట్లు కాదు

ఈసీ జాబితా తయారీకి మాత్రమే పరిమితం

బీహార్ ఎస్ ఐ ఆర్ తీర్పులో స్పష్టం చేసాం

ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు



2



ఓటర్ల జాబితా
## సవరణ
తెలంగాణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వేగవంతం

2

రాష్ట్రానికి వేగం చెప్పిన అధికారిణి...
సొంత శాఖలో మాత్రం నత్తనడక?

దేవీ గారి టేబుల్ పైనే
# వారి భవిష్యత్తు

ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఫైళ్లను కదిలించాలని ఆదేశించిన శాఖలోనే... ఒక కీలక ఫైల్ నెలల తరబడి ముందుకు సాగకపోతే వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తడం సహజం. 99 రోజుల కార్యాచరణకు దిశానిర్దేశం చేసిన అధికార యంత్రాంగమే... సొంత శాఖలో అదే ప్రమాణాలను అమలు చేయలేక పోయిందా? అనే చర్చ ఇప్పుడు ఉద్యోగుల్లో మొదలైంది.

స్టేట్ బ్యూరో, జులై 17 (సింగిడి)



అయితే... సొంత శాఖలోనే నిలిచిపోయిన ఫైల్?

ఉద్యోగుల వాదన ప్రకారం... మెప్మా, సెర్ప్ విలీనానికి సంబంధించిన కీలక ఫైల్ ప్రస్తుతం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీదేవి వద్ద రెండు నెలలుగా పెండింగ్‌లో ఉంది. రాష్ట్రంలోని ప్రతి కార్యాలయానికి ఫైళ్లు ఆగకూడదు అనే సందేశం ఇచ్చిన శాఖలోనే... ఒక ముఖ్యమైన పరిపాలనా నిర్ణయం నిలిచిపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

### రాష్ట్రానికి ఆదేశాలు... శాఖలో మాత్రం ఎదురుచూపులు

మార్చి 2 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో రాష్ట్రవ్యాప్తంగా ఏ కార్యాలయంలోనూ ఫైళ్లు పెండింగ్‌లో ఉండకూడదన్నదే ప్రధాన లక్ష్యంగా ప్రకటించారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖ పరిధిలో నిర్ణయాలు వేగంగా పూర్తి కావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. ఈ మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కీలక అధికారుల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ, MA&UD శ్రీదేవి ప్రధాన పాత్ర పోషించారు.

### ప్రశ్నలు శ్రీదేవి చుట్టూనే...

99 రోజుల ప్రణాళిక అంటే కేవలం ప్రచార కార్యక్రమమా? లేక ప్రతి ఫైల్ సమయానికి పూర్తి చేయాలన్న పరిపాలనా సంస్కృతా? ఆ ప్రణాళికకు బాధ్యత వహించిన అధికారిణి శాఖలోనే ఒక ఫైల్ నెలల తరబడి నిలిచిపోయిందనే ఉద్యోగుల వాదనకు సమాధానం ఎవరు చెబుతారు? వ్యవస్థకు వేగం నేర్పాల్సిన చోటే ఆలస్యం ఎందుకు చోటుచేసుకుంది? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రాష్ట్రానికి పెండింగ్ ఫైళ్లు వద్దు అని చెప్పిన అదే యంత్రాంగం... సొంత శాఖలో పెండింగ్‌పై ఎందుకు మౌనం పాటిస్తోంది? 99 రోజుల ప్రణాళికకు నాయకత్వం వహించిన శ్రీదేవి... మెప్మా ఫైల్‌కు కూడా అదే వేగం చూపిస్తారా? లేక వేలాది మంది ఉద్యోగుల ఆశలు ఇంకొంతకాలం టేబుల్‌పైనే ఆగిపోతాయా? ఇదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### పెండింగ్ ఫైళ్లకు చెక్ అన్న శాఖలోనే 'మెప్మా' ఫైల్‌కు బ్రేక్?

### 99 రోజుల ప్రణాళికకు నాయకత్వం... అమల్లో మాత్రం ప్రశ్నలు.

ప్రభుత్వం ముందుకు...
### వ్యవస్థ వెనక్కా?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఈ అంశంపై సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ఫైల్ ఎక్కడ ఉందని కూడా ఆరా తీసినట్లు పేర్కొంటున్నారు. అయినప్పటికీ సంబంధిత ప్రక్రియ పూర్తి కాకపోవడం వల్ల ప్రభుత్వ సంకల్పం కిందిస్థాయికి ఎందుకు చేరడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



ప్లాస్టిక్ కరెన్సీ
## వచ్చేస్తోంది
తొలుత రూ. 10, రూ. 20 నోట్ల మొదలు

ఇప్పుడున్న ఈ నోట్లు ఆపేసాక చెలామణీలోకి

ఆర్బీఐలోని బీఆర్బీఎన్పీఎల్ కీలక ప్రకటన


2

భారత్ ఆర్థిక వ్యవస్థలో మరో కీలక యుగం ప్రారంభంకానుంది. నోట్ల రద్దు వరకు ఆన్‌లైన్ పేమెంట్ గురించి పెద్దగా తెలియదు. కానీ ఇప్పుడు జేబులో డబ్బులు పెట్టుకొని తిరిగే వారి సంఖ్య భారీగా తగ్గిపోయింది. బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంటే చాలా చేతిలో మొబైల్ అందులో డిజిటల్ పేమెంట్ యాప్ ఉంటే దేశమంతా చుట్టి రావచ్చు. అయితే డిజిటల్ చెల్లింపులు ఎంత పెరుగుతున్నప్పటికీ ఫిజికల్ కరెన్సీ ప్రాధాన్యత కూడా ఏమాత్రం తగ్గడం లేదు. –న్యూఢిల్లీ, (సింగిడి)

## మళ్లీ కరోనా కలకలం..!
ఏపీలో 13 పాజిటివ్ కేసులు

పుణే ల్యాబ్ కు శాంపిల్స్

2



కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్–19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది.

- అమరావతి (సింగిడి)

బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో
## హైకోర్టు గ్రీన్ సిగ్నల్
నేడు సరూర్ నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ

పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్

శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు

ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్

2






సెకండ్ క్లాస్ కేవలం
## కోచ్ గుర్తింపునకే
ప్రయాణికుల్లో రెండో తరగతి సరికాదు

రైల్వేప్రయాణికుల భద్రతపైనా 'సుప్రీం'

2

అంగన్వాడీలకూ
## తల్లికి వందనం
ఆయాలకు, టీచర్లకు కూడా వర్తింపు


రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త

వేలాది మందికి ఊరట

2

రాష్ట్రంలోని అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తల్లికి వందనం పథకాన్ని వీరికీ వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- అమరావతి (సింగిడి)



2

పట్టాలెక్కిన తొలి
## హైడ్రోజన్ రైలు
జెండా ఊపి ప్రారంభించిన మోదీ

రూ. 5 -25 మధ్యే చార్జీలు.. 2,600 మంది ప్రయాణించే ఛాన్స్

*దేశంలో తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభమైంది. ప్రధాని మోదీ తన చేతుల మీదుగా పచ్చజెండా ఊపి ట్రైన్ ప్రారంభించారు. జూలై 17న ఉదయం 11 గంటల సమయంలో హర్యానాలోని జింద్–సోనిపత్ మార్గంలో భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఎలాంటి కార్బన్ ఉద్గారాలను విడుదల చేయని ఈ ట్రైన్‌తో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరనుంది. కేవలం రూ. 5 నుండి ఈ రైలులో ఛార్జీలు ప్రారంభమవుతాయి.*

–న్యూఢిల్లీ, (సింగిడి)

ఛార్జీలు కేవలం రూ. 5 నుండి ప్రారంభమై రూ. 25 వరకు ఉంటాయి. ఈ హైడ్రోజన్ రైలు ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో కూడిన ప్రయాణ అవకాశాన్ని అందించనుంది. దీని ప్రారంభ ఛార్జీ, అనేక రైల్వే స్టేషన్లలోని ప్లాట్ఫారమ్ టిక్కెట్ ఛార్జీల కంటే కూడా తక్కువ. ఈ రైల్లో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. జింద్– సోనిపత్ మధ్య దాదాపు 90 కిలోమీటర్ల దూరాన్ని రెండు గంటల్లోనే పూర్తి చేస్తుంది. ఈ రైలు మార్గంలో 11 చోట్ల ఆగుతుంది. రోజుకు సుమారు 2,600 మంది ప్రయాణికులను తీసుకెళ్లనుంది. దీనిని స్వదేశీ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీని ఉపయోగించి అభివృద్ధి చేశారు. ఇది సాంప్రదాయ ఓవర్‌హెడ్ విద్యుత్ తీగలు లేకుండా నడుస్తుంది.



తెలంగాణ ఉద్యోగుల
## ఆరోగ్య పథకం
కొత్తహెల్త్ కార్డులు అందజేసిన మంత్రులు

2

సచివాలయంలో నూతన ఈహెచ్ఎస్ ప్రారంభ కార్యక్రమం

ఉద్యోగుల హెల్త్‌కార్డులను ఆవిష్కరించిన భట్టి విక్రమార్క, రాజనరసింహ

9.5 లక్షల మంది ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపేలా ఈహెచ్ఎస్ తెచ్చామన్న భట్టి

ధరణి అక్రమాలపై విచారణకు
# సిట్ ఏర్పాటు
తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం



ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ

ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినేట్

జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం

పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు

బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం

దేవాదుల, పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు

2

తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

హైదరాబాద్, జూలై 17 (సింగిడి)

## రాజ్యాంగ సవరణ బిల్లులపై ఉత్కంఠ
పార్లమెంట్ కు కీలక బిల్లులు... జులై 20 నుంచి 13 వరకు సభలు



*దేశ అత్యున్నత చట్టసభ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం అజెండాను ఖరారు చేసింది. సమావేశాల్లో భాగంగా కేంద్రప్రభుత్వం పలు కీలక చట్టాలను చేయనుంది.* -న్యూఢిల్లీ, (సింగిడి)

2



## వైసీపీ పాలనలో విధ్వంసం.. చీకట్లు
కేంద్రం సహకారంతో బయటపడ్డాం

రైతులందరికీ రుణాలు

5లక్షల మందితో ఎంఎస్ఎంఈలు

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

పల్నాడులో భారీ రుణమేళా

హాజరైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

2

బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదు, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువకుడి ఆశయానికి, మహిళా సాధికారతకు ఈ రుణాలు ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే క్రెడిట్ అవుట్‌రీచ్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో నేడు జరిగిన భారీ రుణ మేళా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు.

పల్నాడు, జూలై 17 (సింగిడి)

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
18 జూలై 2026

# ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు

గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా



చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయం ప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.



## పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు ఈసీకి లేదు

ఓటరు జాబితాలో పేరు లేకపోవడం వల్ల ఎవరూ పౌరసత్వాన్ని కోల్పోరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. పౌరసత్వాన్ని నిర్ధారించే అంతిమ అధికారం భారత ఎన్నికల సంఘానికి లేదని తేల్చి చెప్పింది. ఓటర్ల జాబితా నుండి తొలగించినంత మాత్రాన పౌరసత్వాన్ని కోల్పోరని బీహార్ ఎస్ ఐ ఆర్ తీర్పులోనే తాము స్పష్టం చేశామని కోర్టు పేర్కొంది. ఎస్ ఐ ఆర్ నుండి మినహాయించిన వ్యక్తుల అప్పీళ్లను విచారించడానికి ఏర్పాటు చేసిన అప్పీలేట్ ట్రిబ్యునళ్లలో విచారణ ప్రక్రియను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు చేసిన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఒక వ్యక్తి భారత పౌరుడా? కాదా? అని నిర్ధారించే తుది అధికారం ఈసీకి లేదని, ఓటరు జాబితాలో పేరు లేకపోవడం అనేది కేవలం ఆ వ్యక్తికి ఓటు హక్కు లేదని మాత్రమే సూచిస్తుంది. అంతేతప్ప, అది పౌరసత్వాన్ని రద్దు చేసే పత్రం కాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగింపు వల్ల పౌరసత్వం పోతుందని, దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని కొందరు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఈ వివరణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, తప్పుగా పేర్లు తొలగింపునకు గురైన వారి కోసం సరైన అప్పీల్ వ్యవస్థ ఉండాలని కోర్టు సూచించింది. ఎన్నికల ప్రక్రియ కోసం ఈసీ చేసే వెరిఫికేషన్ కేవలం జాబితా తయారీకి మాత్రమే పరిమితమని స్పష్టం చేసింది.

**ఓటు లేని వారికి సంక్షేమ పథకాలు కట్!**

బెంగాల్ లో ఓటర్ల జాబితాలో ఓటు హక్కు కోల్పోయిన వారు 19 అప్పీలేట్ ట్రిబ్యునళ్ల ముందు 34 లక్షల అప్పీళ్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.. ఇప్పటివరకు చాలా తక్కువ అప్పీళ్లు సుమారు 38,000 మాత్రమే పరిష్కరించారు. వాటిలో కనీసం 70 శాతం అప్పీళ్లు అనుమతించారు. అప్పీళ్లు పెండింగ్‌లో ఉండగానే, ఓటర్ల జాబితా నుండి తొలగించిన వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద ప్రయోజనాలను, అన్నపూర్ణ యోజన వంటి సంక్షేమ పథకాలను నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఆ వ్యక్తులకు కుల ధృవీకరణ పత్రాలను కూడా నిరాకరిస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకి తెలిపారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తిని ఓటర్ల జాబితా నుండి తొలగించిన తర్వాత, వారి పౌరసత్వ స్థితిని నిర్ధారించడానికి కేంద్రానికి దరఖాస్తు చేసుకోవడం ఈసీఐ విధి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. పశ్చిమ బెంగాల్ ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లతో పాటు ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తున్నారన్న పిటిషన్ ను విచారణ జరపాలని సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ణయించింది.

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు

కార్బన్ ఉద్గారాలను విడుదల చేసే డీజిల్ రైళ్లలా కాకుండా.. ఈ హైడ్రోజన్ రైలు కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తుంది. దీంతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు. ఈ రైలును నడపడానికి అవసరమైన గ్రీన్ హైడ్రోజన్‌ను జింద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్లాంట్ నుండి సరఫరా చేస్తారు. సురక్షితమైన కార్యకలాపాలను నిర్ధారించడానికి ఈ ప్రాజెక్ట్‌లో అధునాతన భద్రతా ఫీచర్లు కూడా ఉన్నాయి. విలాసవంతమైన సీట్లు ఉంటాయి. హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్షన్ సిస్టమ్‌లు, నిరంతర వెంటిలేషన్, ఆటోమేటెడ్ హైడ్రోజన్ షట్-ఆఫ్ మెకానిజమ్‌లు, లోకోమోటివ్ పైలట్‌ల కోసం రియల్-టైమ్ హెల్త్ మానిటరింగ్ వంటివి ఉన్నాయి. అత్యంత సౌకర్యవంతంగా ఇందులో ప్రయాణం చేయవచ్చు.

## సెకండ్ క్లాస్ కేవలం కోచ్ గుర్తింపునకే

**న్యూఢిల్లీ,జూలై17 (సింగిడి)**

రైల్వే ప్రయాణికుల ఆత్మగౌరవం, భద్రత, ప్రమాద పరిహారానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఇకపై ప్రయాణికులను 'రెండవ తరగతి ప్రయాణికులు' అని సంబోధించవద్దని రైల్వే శాఖను ఆక్షేపించింది. 'క్లాస్' అనే విభజన కేవలం రైలు కోచ్‌లకు మాత్రమే పరిమితం కావాలని, మనుషులకు కాదని జస్టిస్ సంజరు కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రయాణికులను అలా పిలవడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది గత చరిత్రలోని వర్గ విభజనలను గుర్తు చేస్తోందని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. ఒక రైలు ప్రమాద బాధితురాలికి రూ. 8 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించిన కోర్టు.. ప్రమాద సమయంలో టికెట్ పోయినంత మాత్రాన పరిహారాన్ని నిరాకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. బాధిత కుటుంబాలు అఫిడవిట్ ఇస్తే సరిపోతుందని, సదరు ప్రయాణికుడికి టికెట్ లేదని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా రైల్వే శాఖదేనని స్పష్టం చేసింది. రైల్వే ప్రమాద పరిహార చట్టాలను మానవతా దృక్పథంతో, ఉదారంగా అమలు చేయాలని ధర్మాసనం హితవు పలికింది. భద్రతా నిబంధనలు కాగితాల్లో బాగున్నా.. క్షేత్రస్థాయిలో అమలు లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేసింది. రైల్వేల్లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయడం ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, రైల్వే భద్రతను కూడా మెరుగుపరచవచ్చని కోర్టు సూచించింది. అదే సమయంలో ప్రయాణికులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని, ప్రాణాలకు తెగించి ఫుట్‌బోర్డ్ ప్రయాణాలు చేయవద్దని ధర్మాసనం హెచ్చరించింది.

# ప్లాస్టిక్ కరెన్సీ వచ్చేస్తోంది

అందుకే ఏటా కోట్ల రూపాయల నోట్లు వివిధ కారణాలతో రద్దు చేయాల్సి వస్తోంది. అందుకే కరెన్సీలో మార్పులకు ఆర్బీఐ శ్రీకారం చుట్టింది. పది రూపాయలు, ఇరవై రూపాయలు ఇప్పుడున్న నోట్లను పూర్తిగా ప్రింటింగ్ ఆపేసి సరికొత్తగా ప్లాస్టిక్ కరెన్సీని చెలామణిలోకి తీసుకురానున్నట్టు చెబుతోంది. ఆర్బీఐ తరపున నోట్లు ముద్రించే విభాగంలో బీఆర్బీఎన్ఎంపీఎల్ కీలక ప్రకటన చేసింది.ప్లాస్టిక్ కరెన్సీకి కావాల్సిన ముడిసరకు సరఫరా కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ముడిసరకు సరఫరా చేసేందుకు చేసేందుకు టెండర్లను పిలిచి అధికారికం ప్రక్రియ ప్రారంభించింది. ఈ విభాగంలో ఆసక్తి ఉన్న కంపెనీలు ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొవచ్చు. పాలిమర్ నోట్లనే ప్లాస్టిక్ నోట్లు అంటారు. వీటిని పాలిమర్ షీట్లపై ముద్రిస్తారు. ఇది ఫిల్మ్‌లా ఉంటుంది. ఇది చాలా గట్టిగా దృఢంగా ఉంటుంది. దీనిపై పూత పూసి నోట్లకు సంబంధించిన వివరాలు ముద్రిస్తారు. దీన్ని డూప్లికేట్ చేయడానికి లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. దీనికి ఒక వైపు చిన్న పలక మాదిరిగా పెడతారు. అందులో నోట్‌కు సంబంధించిన వివరాలు పొందుపరుస్తారు. దీని వల్ల ఇది ఫేక్ కాదని గుర్తించవచ్చు. అలాంటి వివరాలు లేకుంటే అది ఫేక్ అని నిర్ధారణకు రావచ్చు. ముందు పాలిమర్ నోట్లను పది, ఇరవై రూపాయల కెరెన్సీతో ప్రారంభిస్తారు. ఇవి చాలా ఎక్కువ జనాలు వాడతారు. నార్మల్‌గా వీటి తయారీ ఖర్చు కూడా ఎక్కువగా ఉంటుంది. త్వరగా పాడైపోతాయి. అందుకే ముందుగా వాటినే ప్రయోగాత్మకంగా చలామణిలోకి తీసుకొస్తారు. ఇలా చేయడం వల్ల ప్లాస్టిక్ నోట్ల పని తీరుపై ఒక సరైన అవగాహన వస్తుంది. ఇది విజయవంతం అయితే మిగతా నోట్లను కూడా ఈ విధానంలో ముద్రిస్తారు. త్వరలోనే పాలిమర్ నోట్లను తీసుకురాబోతున్నట్టు గత నెలలో జరిగిన ద్రవ్యవిధాన ప్రకటనలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఆయన చెప్పిన నెల రోజుల తర్వాత పాలిమర్ షీట్ల కోసం ఆర్బీఐ టెండర్లను పిలిచింది. దీని ప్రకారం ప్రపంచవ్యాప్తంగా పాలిమర్ సప్లై చేసే కంపెనీలు ఈ టెండర్‌లలో పాల్గొనవచ్చు. అయితే ప్రక్రియ ఇప్పుడు అధికారికంగా ప్రారంభమైనప్పటికీ జనాల చేతికి ప్లాస్టిక్ కరెన్సీ వచ్చే సరికి చాలా సమయం పట్టవచ్చు.

**ఆర్బీఐ పాటించే ప్రక్రియ ఏంటీ?**

ఇప్పుడు ఆసక్తి ఉన్న కంపెనీల నుంచి ముడిసరకు కోసం ఆసక్తిని తెలపాలని మాత్రం చెప్పారు. తర్వాత టెండర్ల ప్రక్రియ ఉంటుంది. అనంతరం టెక్నికల్ పరిశీలన ఉంటుంది. మోడల్‌ను పరీక్షిస్తారు. దాన్ని భద్రతను పరిశీలిస్తారు. పైలట్ ప్రాజెక్టు కింద పది రూపాయలు, ఇరవై రూపాయల నోట్లతో చెలామణిలోకి తీసుకొస్తారు. ఇప్పుడు ఉన్న కరెన్సీతోపాటు ప్లాస్టిక్ కరెన్సీ కూడా అందుబాటులోకి తెస్తారు. కొంతకాలం పరిశీలించి అప్పుడు ఒక నిర్ణయం తీసుకుంటారు. భారత్‌లో ప్లాస్టిక్ నోట్ చెలామణిలోకి తీసుకురావాలనే ఆలోచన 2009లో మొదలైంది. 2012లో పది రూపాయ నోట్లతోనే దీన్ని ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇలా ముద్రించిన నోట్లను వివిధ పరిస్థితుల్లో ప్రయోగించాలని 2014లో భావించారు. తర్వాత వివిధ కారణాలతో ప్రాజెక్టును ఆపేశారు. మళ్లీ 2026లో ప్రక్రియను మొదలు పెట్టారు. ఓవైపు డిజిటల్ చెల్లింపులు భారీగానే జరుగుతున్నాయి. అదే సమయంలో కరెన్సీ ప్రాధాన్యత తగ్గేదేలే అన్నట్టు ఉంది. 2026లో 42.86 కోట్ల రూపాయల నగదు దేశంలో చెలామణి అవుతోంది. అందుకే ఇందులో కోట్ల రూపాయల విలువైన కరెన్సీ వివిధ కారణాలతో నాశనమవుతోంది. వీటిని మళ్లీ ముద్రించేందుకు కోట్ల రూపాయలు ఆర్బీఐ ఖర్చు చేయాల్సి వస్తోంది.

**ప్లాస్టిక్ కరెన్సీ ప్రయోజనాలు ?**

ఎక్కువ కాలం మన్నిక అయ్యే ప్లాస్టిక్ కరెన్సీ తీసుకు వస్తే ఆర్బీఐపై భారం తగ్గుతుందని ఆలోచన ఉంది. ఇప్పుడు ఉన్న కరెన్సీ కంటే నాలుగైదు సంవత్సరాలు ఎక్కువ కాలం చెలామణిలో ఉంటాయి. నీటిలో త్వరగా పాడయ్యే పరిస్థితి ఉండదు. నోటు త్వరగా నాశనం కాదు. ఇందులో భద్రతా ఫీచర్స్ కారణంగా ఫేక్ చేయడానికి కూడా వీలు ఉండదు. ఈ విషయంలో ఆర్బీఐ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్లాస్టిక్ కరెన్సీతో వచ్చే సమస్యలేంటి? పాలిమర్ కరెన్సీ నోట్ల విషయంలో కూడా చాలా అనుమానాలు ఉన్నాయి. భారత్ వంటి ఉష్ణ ప్రాంతంలో ప్లాస్టిక్ కరెన్సీ మనుగడ అంత ఈజీ కాదు. ఇప్పుడు దీనికి కావాల్సిన ముడి పదార్థాన్ని విదేశాల నుంచి తెప్పించుకోవాలి. ఇది ఖరీదుతో కూడుకున్న వ్యవహారం. వాటిని భరించి పాలిమర్స్ కరెన్సీ తీసుకొచ్చినా... ఇప్పుడు ఉన్న ఏటీఎంలు, నోట్ల లెక్కింపు యంత్రాలు అన్నింటినీ మార్చాల్సి ఉంటుంది. ఇది బ్యాంకులకు భారం కానుంది. పాలిమర్స్ నోట్లు మడిచినప్పుడు ముడతలు పడుతున్నాయే ఫిర్యాదు చాలా దేశాల్లో ఉంది. దీన్ని కూడా అధిగమించాల్సి ఉంటుంది. అయితే ప్రారంభ ఖర్చు ఎక్కువగా ఉన్నప్పటికీ కాలక్రమేణా ఆ ఖర్చు తగ్గుతుందని చెబుతున్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో పాలిమర్ కరెన్సీ చెలామణిలో ఉంది. దీన్ని మొదట తీసుకొచ్చింది మాత్రం ఆస్ట్రేలియా. ఇక్కడ 1988లోనే తొలిసారిగా అమల్లోకి వచ్చింది. తర్వాత అక్కడ వాటి ప్రయోజనాలను గుర్తించిన బ్రిటన్, కెనడా, సింగపూర్, న్యూజిలాండ్, వియత్నాం, మలేషియా, బ్రూనై వంటి 40 దేశాల్లో ఈ ప్లాస్టిక్ కరెన్సీ వాడుకలో ఉంది.



## రాజ్యాంగ సవరణ బిల్లులపై ఉత్కంఠ

జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు, 2026.. వందేమాతరం ,జనగణమన పడుతున్నప్పుడు ఉద్దేశపూర్వకంగా అవమానించడం లేదా అంతరాయం కలిగించడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించేలా ఈ బిల్లును రూపొందించారు. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు, 2026 విదేశీ నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ఈ సవరణను తీసుకురానున్నారు. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026 ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశ్యం. వీటితో పాటు విక్షిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు (33 నుంచి 37కి) బిల్లు, ఆదాయపు పన్ను సవరణ బిల్లు, మరియు ఎంఎస్ఎంఈ రంగ అభివృద్ధికి సంబంధించిన సవరణ బిల్లులను సభ ముందు ఉంచనున్నారు. పార్లమెంట్ సభ్యులకు పంపిణీ చేసిన ప్రాథమిక అజెండాలో 130వ , 131వ రాజ్యాంగ సవరణ బిల్లులు లేనప్పటికీ, వాటి ప్రస్తావన ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వీటిని బిజినెస్ అడ్వైజరీ కమిటీ లో చర్చించి నిర్ణయం తీసుకుంటారా, లేదా నేరుగా సభలో ప్రవేశపెడతారా అనేది ఉత్కంఠ రేకెత్తిస్తోంది..సమావేశాల నిర్వహణలో భాగంగా ఎంపీల కోసం లోక్‌సభ సచివాలయం కఠినమైన మార్గదర్శకాలను జారీ చేసింది. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి నిఘా పరికరాలను అనుమతించరు. అలాగే, పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలకు పూర్తి నిషేధం విధించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## మళ్లీ కరోనా కలకలం..!

తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. జూన్ 26 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో మొత్తం 13 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. కడప జిల్లా 8, గుంటూరులో 3, విశాఖ, కాకినాడ జిల్లాల్లో ఒక్కో కేసు గుర్తించారు. వేర్వేరు ప్రాంతాల్లో కేసులు నమోదైనా, ఒకేచోట గుంపుగా బయటపడలేదని వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. కరోనా వచ్చిన వారంతా హోం ఐసోలేషన్ లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. వారంతా కరోనాతోపాటు.. పలు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఇటు మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో కొవిడ్ కలకలం రేగింది. నిన్న కరోనా లక్షణాలతో వచ్చిన ఒక వ్యక్తికి వైద్యులు చికిత్స అందించి హోం ఐసోలేషన్‌కు పంపించారు. ఎయిమ్స్‌లో ప్రత్యేక ఫీవర్ వార్డును ఏర్పాటు చేశారు. మరోవైపు జ్వరం కేసుల దృష్ట్యా జిజిహెచ్ వైద్యులు కూడా అప్రమత్తమయ్యారు. ఆసుపత్రి వర్గాలు ఇప్పటికే 250 ఆర్టీపీసీఆర్ కిట్లను సిద్ధం చేసి... అనుమానితులకు కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**పుణే ల్యాబ్ కు ఐదు శాంపిల్స్..**

కరోనా కేసుల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వైరస్ జన్యుక్రమ విశ్లేషణ కోసం 5 నమూనాలను పుణెలోని జాతీయ వైరాలజీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

**పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం - మంత్రి సత్యకుమార్**


రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు నమోదవుతున్నాయని జనం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. దేశవ్యాప్తంగా 339 కొవిడ్ కేసులు నమోదయ్యాయని కేరళలో 115, కర్ణాటకలో 64, తమిళనాడులో 39 కేసులు బయటపడ్డాయని తెలిపారు.

## వైసీపీ పాలనలో విధ్వంసం.. చీకట్లు

స్థానిక కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో జరిగే సభలో పాల్గొని రూ. 3,216 కోట్ల రుణాలను రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ "పల్నాడు పౌరుషానికి శక్తిమంతమైన ఆయుధమిస్తున్నాం. పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. ఏ అభివృద్ధి కార్యక్రమం తెచ్చినా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు ఇలా అర్హులైన అందరికీ రుణం అందించడమే లక్ష్యం. ప్రజల వద్దకే బ్యాంకులు వెళ్లి రుణాలు అందించడం గర్వకారణం. ఈ ఏడాది 5 లక్షల మందితో ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసేలా చర్యలు. బ్యాంకింగ్‌లో నిర్మలా సీతారామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు.



నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం తీసుకొచ్చారు. జనధన్ యోజన ద్వారా కోట్లాదిమందికి బ్యాంకు ఖాతాలిచ్చారు. జీఎస్టీ శ్లాబ్‌లు ఎక్కువ ఉండేవి చాలామంది నష్టపోయారు. రైతులు, పేదలకు న్యాయం జరిగేలా జీఎస్టీ శ్లాబులు మార్చారు. క్రియేటివ్‌గా ఆలోచించే సమర్థ మంత్రిగా నిర్మలను చూశాం. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు నిర్మల తీసుకొచ్చారు. రాబోయే రోజుల్లో 6 జిల్లాల్లో సమావేశాలు పెడదామంటే నిర్మల అంగీకరించారు. త్వరలోనే 3 నెలల ఒకటి, క్రెడిట్ అవుట్‌రీచ్ వంటి కార్యక్రమాలు. ఈ సమావేశాలకు నిర్మలా సీతారామన్ వస్తారని ఆమెను కోరుతున్నా. రెండేళ్లకు మునుపు రాష్ట్రంలో అంతా చీకటి, విధ్వంసం. ఎప్పుడూ చూడని ఆర్థిక సంక్షోభాన్ని చూశాం. ఎక్కడ చూసినా సమస్యల సుడిగుండమే. రాష్ట్రాన్ని మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పాం. మళ్లీ బయటపడ్డామంటే కేంద్ర సహకారమే" అని సీఎం చంద్రబాబు తెలిపారు.



## ఓటర్ల జాబితా సవరణ

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ క్యాంపులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సవరణ ప్రక్రియ జరుగుతున్న తీరును బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. శిబిరాల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడారు. వారికి పార్టీలు తరపున గుర్తింపు కార్డులు జారీ అయ్యాయా అన్న అంశంపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు, బీఎల్ఓల సమన్వయంతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. పొడిగించిన గడువును దృష్టిలో ఉంచుకుని సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని పక్షంలో, వాటిని వెంటనే సూపర్ వైజర్ల నుంచి సేకరించాలని ఆయన ఆదేశించారు.



## అంగన్వాడీలకూ తల్లికి వందనం

రాష్ట్రంలోని అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తల్లికి వందనం పథకాన్ని వీరికీ వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ సిబ్బంది అందరికీ వర్తించనుంది. చాలా కాలంగా వారు కోరుతున్న డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పలుమార్లు తమ విజ్ఞప్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై సమగ్రంగా పరిశీలించిన ప్రభుత్వం చివరకు వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అంగన్వాడీ సిబ్బందికి ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. ఈ నిర్ణయంపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్ర అంగన్వాడీ కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం అంగన్వాడీ సిబ్బందిలో మరింత ఉత్సాహం, భరోసా నింపుతుందని చెప్పారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకోవడం అంగన్వాడీ సిబ్బందికి గొప్ప గుర్తింపని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుందనే సందేశాన్ని ఈ నిర్ణయం ఇస్తోందని ఆమె తెలిపారు.




## 'టీవీఆర్'లో ఘనంగా

# క్రమశిక్షణ మండలి ఏర్పాటు

### విద్యార్థి దశ నుండి నాయకత్వపు లక్షణాలు అలవర్చుకోవాలి : ఎస్ఐ శ్యాంబాబు

**కుత్బుల్లాపూర్, జూలై 17 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీలోని టివిఆర్ మోడల్ హైస్కూల్లో టివిఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పి వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం క్రమశిక్షణ మండలిని( ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ) ఏర్పాటు చేశారు. క్రమశిక్షణామండలిలో ముఖ్యంగా ధర్మాన్ని నువ్వు రక్షిస్తే నిన్ను ధర్మం రక్షిస్తుంది అను నిఘంటువుకు నిలువెత్తు నిదర్శనంగా ధర్మా గ్రూప్ ,శాంతి గ్రూప్, ప్రేమ గ్రూప్, సత్యా గ్రూప్, అను 4 నాలుగు విభాగాలకు హౌస్ కెప్టెన్, హౌస్ టీచర్ లను నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా "శ్యాం బాబు ఎస్ ఐ హాజరై విద్యార్థిని విద్యార్థులకు స్లాషెస్, బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాలకు చెందిన 7 వ, 8 వ, 9 వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులచే క్రమశిక్షణ మండలి నాయకులను ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోబడ్డారని టివిఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎన్నుకోబడిన



క్రమశిక్షణామండలిలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, సి సి ఏ బాయ్, సి సి ఏ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్ బాయ్, స్పోర్ట్స్ కెప్టెన్ గర్ల్, డిస్ప్లేన్ కెప్టెన్స్, స్కూల్ కల్చరల్ కెప్టెన్స్ లుగా గెలిచిన వారిని స్కూల్ క్యాబినెట్ గా పరిగణించి క్రమశిక్షణ మండలి సభ్యులచే ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ శ్యాంబాబు టివిఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణారెడ్డిలు ప్రమాణస్వీకారం చేయించి మార్చ్ ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్ ఐ శ్యాంబాబు మాట్లాడుతూ ఉన్నతమైన విద్యను అవలంబిస్తూ జ్ఞానవంతులుగా, క్రమశిక్షణ గల విద్యార్థినీ విద్యార్థులుగా ఎదగాలని సూచించారు. విద్యార్థి దశ నుండి నాయకత్వపు లక్షణాలను అలవర్చుకొని, స్నేహపూరితమైన మనస్తత్వాన్ని, పెద్దల పట్ల, గురువుల పట్ల, సమాజం పట్ల గౌరవ మర్యాదలతో ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ గల నాయకులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఎస్ఐ శ్యామ్ బాబు క్రమశిక్షణ మండలి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం జయరాజ్, విద్యార్థిని విద్యార్థులు, హౌస్ వైజ్ టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్ క్యాబినెట్ విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను టి వి ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి కోటి రెడ్డి అభినందించారు.

## ఎస్ఐఆర్ ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మల్కాజిగిరి, జులై 17(సింగిడి):** చర్లపల్లి డివిజన్ లో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాండాల శివ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ ప్రచార రథాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరు తన పేరును ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పకుండా పరిశీలించుకోవాలని సూచించారు. పేరు నమోదు, మార్పులు, చిరునామా సవరణలు, తొలగింపులు వంటి అవసరమైన సేవలను గడువులోగా పూర్తి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తమ ఓటు హక్కును పరిరక్షించుకునేలా అవగాహన కల్పించడమే ఈ ప్రచార రథం ముఖ్య ఉద్దేశమని, ప్రతి కుటుంబాన్ని చేరుకుని ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివరాలు తెలియజేస్తూ ప్రజలను చైతన్యపరిచేందుకు ఈ ప్రచార రథం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యకు ఆర్థిక తోడ్పాటు

### విద్యార్థినికి రాము చేయూత



**ఆమనగల్లు, జూలై 17 (సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధికి చెందిన నాగోజు శివాని, సురేందర్ చారి దంపతుల కుమార్తె హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్ కోర్సులో సీటు సాధించారు. కార్పెంటర్‌గా పనిచేస్తున్నసురేందర్ చారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, కౌన్సిలర్, సంఘ సేవకులు పాపిశెట్టి రాము శివాని ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదని, వారికి చేయూత అందించడం సమాజ బాధ్యత అని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, శిరమోని రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు రాముకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆర్యవైశ్య సంఘం అల్వాల్ నూతన అధ్యక్షుడిగా అమర శ్రీనివాస్ గుప్తా



**అల్వాల్, జూలై 17 (సింగిడి):** అల్వాల్ పట్టణంలోని శ్రీ సాయి సూర్య ఎన్‌క్లేవ్ ఫేజ్--2లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం అల్వాల్ (అవస) నూతన అధ్యక్షుడిగా అమర శ్రీనివాస్ గుప్తాకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు, సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభివృద్ధికి సంఘ సభ్యులు అందరి సహకారంతో, ఐక్యతతో పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు ఆర్ అరుణ్ కుమార్, బోనగిరి గోవర్ధన్, తడక వెంకటేష్, అశ్వత్ నారాయణ, పబ్బ చంద్రశేఖర్, తాటిపల్లి రమేష్, వాసవి మాత దేవాలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం ఆనందబాబు, దేచు గంగాధర్, గోలి వేణు గోపాల్, తోట శివ, మందమూల వీరేశం, శివరాత్రి శ్రీనివాస్, గుమ్మడవెల్లి శ్రీనివాస్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం

### దోస్త్-2026 స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ షెడ్యూల్ విడుదల



**దుబ్బాక, జూలై 17(సింగిడి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాకలో నూతనంగా ప్రవేశం పొందిన ప్రథమ సెమిస్టర్ విద్యార్థుల కోసం శుక్రవారం కళాశాల సెమినార్ హాలులో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని మాట్లాడుతూ, విద్యార్థులు డిగ్రీ విద్యను కేవలం పరీక్షలకే పరిమితం చేయకుండా విజ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఉపాధి అవకాశాల సాధనకు ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న గ్రంథాలయం, ప్రయోగశాలలు, డిజిటల్ వనరులు, కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వివిధ క్లబ్‌లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్యాంసుందర్ మాట్లాడుతూ, కళాశాల నిబంధనలను పాటిస్తూ క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను చేరుకోగలడని పేర్కొన్నారు. తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ అధ్యాపకుల మార్గదర్శకత్వాన్ని అనుసరించాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, రఘునందన్ రెడ్డి, ఆంజనేయులు, డాక్టర్ వెంకటేష్, రాజశేఖర్, ఎల్లయ్య తమ తమ విభాగాలను విద్యార్థులకు పరిచయం చేశారు. సిలబస్, అకడమిక్ క్యాలెండర్, అంతర్గత పరీక్షలు, సెమిస్టర్ విధానం, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, నైపుణ్యాభివృద్ధి కోర్సులు, కెరీర్ అవకాశాలు, పోటీ పరీక్షల సన్నద్ధత, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అలాగే హాజరు ప్రాముఖ్యత, పరీక్షా విధానం, యాంటీ ర్యాగింగ్ నిబంధనలు, మహిళా భద్రత, మెంటర్-మెంటీ విధానం, ఎన్ఎస్ఎస్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపాధి ఉన్నత విద్య అవకాశాలపై విద్యార్థులకు వివరించారు. అధ్యాపకేతర సిబ్బంది రాజు, సాయి కృష్ణ, ఇమ్రాన్ అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, కళాశాల పరిపాలనా విధానాలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సేవలపై సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ప్రథమ సెమిస్టర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులు తమ విద్యా ప్రయాణంలో విజయాలు సాధించాలని కళాశాల అధ్యాపక బృందం ఆకాంక్షించింది.

**దోస్త్-2026 స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ విడుదల**

తెలంగాణ ఉన్నత విద్యామండలి టీజీ సిహెచ్ ఈ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సిసి ఈడిఓఎస్‌టి-2026-27 స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ షెడ్యూల్ విడుదలైంది. స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్ జూలై 20 నుంచి 26 వరకు, వెబ్ ఆప్షన్లు జూలై 20 నుంచి 27 వరకు అందుబాటులో ఉంటాయి. స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్ల ధృవీకరణ జూలై 27న, సీట్ల కేటాయింపు ఫలితాలు జూలై 30న విడుదల కానున్నాయి. సీట్లు పొందిన విద్యార్థులు జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలి. అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 1 వరకు, కేఎస్ఆర్ స్కూల్ క్యాంపస్‌లోని నూతన భవనానికి మారిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాక అడ్మిషన్ కార్యాలయంలో అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని తెలిపారు. డిగ్రీలో ప్రవేశం పొందాలనుకునే అర్హులైన విద్యార్థులు ఈ స్పెషల్ ఫేజ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ స్వీకరణను వేగవంతం చేయండి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచన



**మేడ్చల్ కలెక్టరేట్, జులై 17 (సింగిడి):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బిఎల్ఓ లకు సూచించారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని అల్వాల్ మండలంలోని 9వ నంబరు పోలింగ్ స్టేషన్ దగ్గర నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి ఎల్ వో లు ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వడంలోనూ అదే విధంగా పూరించిన ఫారాలను తీసుకోవడంలోనూ పూర్తి బాధ్యతగా వ్యవహరించాలన్నారు ఫారాలు పూరించడంలో ఓటర్ల సందేహాలను నివృత్తి పరుస్తూ వారికి అవగాహన కల్పించాలన్నారు. సర్ ప్రక్రియను వేగవంతం చేస్తూనే తీసుకున్న ఫారాలను వెంటవెంటనే డిజిటలైజ్ చేయించాలని బిఎల్ఓ లను ఆదేశించారు. తీసుకున్న ఫారాల డిజిటలైజ్ ఏవిధంగా చేస్తున్నారని ప్రత్యక్షంగా పరిశీలించారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సూపర్వైజర్లకు అందించాలని బిఎల్ఓ లను ఆదేశించారు. రోజువారీ టార్గెట్ ను ఏ విధంగా పూర్తి చేయాలో అవసరమైన సలహాలు సూచనలు కలెక్టర్ బిఎల్ఓలకు ఇచ్చారు.

## అమ్మవారికి ఒడి బియ్యం



**అల్వాల్, జూలై 17(సింగిడి):** అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సర్వేశుని గుట్ట శ్రీ సర్వేశ్వరాలయంలో శుక్రవారం అల్వాల్ ఆర్యవైశ్య మహిళా మహారాణుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెలబ్రిటీ ఎస్ఎస్ కపుల్స్ సంధ్య శ్రీకాంత్ హాజరయ్యారు. ప్రతి నెలా ఒక అమ్మవారి ఆలయాన్ని ఎంపిక చేసి ఓడి బియ్యం సమర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తడక మంజుల వెంకటేష్, పెద్దిరమా, తడుపునూరి మంజుల, పెద్దిగారి మాధవి, రేవతి, శైలజ, సరిత, రజిని, లావణ్య, బచ్చు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ క్రైమ్ టీమ్‌కు సిపి రివార్డులు



**అల్వాల్, జూలై 17 (సింగిడి):** హనీ టాప్. నకిలీ పోలీసుల కిడ్నాప్ కేసులో అంతరాష్ట్ర దోపిడి ముఠా సభ్యులను ప్రత్యేక ఆపరేషన్ ద్వారా అరెస్టు చేసిన కేసు చేదించిన అల్వాల్ పోలీస్ స్టేషన్ క్రైమ్ పోలీసులు బృందాన్ని మల్కాజ్గిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ బి. సుమతి అభినందించి రివార్డులు అంద జేశారు. కేసు దర్యాప్తులో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కె. వీరబాబు, ఎస్సై కే చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ ఎం జీవన్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ రమాకాంత్, గౌస్ పాషా, కీలక పాత్ర పోషించడంతో కేసు చేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ బృందాన్ని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా వారాహి నవరాత్రోత్సవాలు

### మాజీ కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్

**జవహర్ నగర్, జులై 17 (సింగిడి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ శ్రీరామ్ నగర్ కాలనీలో శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వారాహి నవరాత్రి వేడుకలు రెండవ రోజైన శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల తొలి రోజున అమ్మవారు శ్రీ వారాహి దేవి అలంకరణతో భక్తులకు దివ్యంగా దర్శనం ఇవ్వగా రెండవ రోజైన శుక్రవారం వారాహి మాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ మాట్లాడుతూ ఉత్సవాలు అంగరంగ వైభవంగా అమ్మవారు శ్రీ వారాహి దేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనమిస్తున్నారని ఆ అమ్మవారి దయవల్ల జవహర్ నగర్ ప్రజలే కాక జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నట్టు తెలిపారు. అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ శ్రీ పోచమ్మ తల్లేనని, ఈరోజు నుండి అమ్మవారు వారాహి దేవి అలంకరణలో దర్శనమిస్తున్నారని కావున భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో అమ్మవారి భక్తులు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు పసుపు కుంకుమలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ నగర్ పరిసర ప్రాంతాలు పండుగ శోభతో దేదీప్య మానవయ్యాయి.

## ఈ - కేవైసి పూర్తి చేసుకోవాలి

### జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ



**సిద్ధిపేట బ్యూరో, జూలై 17 (సింగిడి):** రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ శుక్రవారం రోజున పత్రికా ప్రకటనలో తెలిపారు. కమిషనర్, పౌర సరఫరాల శాఖ, తెలంగాణ వారి ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నిరంతరాయంగా ఆహార ధాన్యాల పంపిణీ కొనసాగించేందుకు రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ ప్రక్రియను ఈ నెల 31 లోపు తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 10,47,075 మంది లబ్ధిదారులు ఉండగా, ఇప్పటివరకు 8,48,446 మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారన్నారు. దీంతో జిల్లాలో 81.03 శాతం ఈ-కేవైసీ పూర్తి అయిందన్నారు. కొన్ని రేషన్ కార్డులలో కుటుంబ సభ్యులలో ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేసి, మిగిలిన సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోనట్లు గుర్తించడమైనదనీ పేర్కొన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేయని కుటుంబ సభ్యుల వివరాలను క్షేత్రస్థాయి యంత్రాంగానికి అందజేయడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు, చౌక ధరల దుకాణ డీలర్లు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది ఆయా కుటుంబాలను సంప్రదించి ఈ-కేవైసీ పూర్తి చేయించేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ-కేవైసీ పూర్తి చేయని రేషన్ కార్డుదారులందరూ తమ సమీప చౌక ధరల దుకాణాన్ని సంప్రదించి వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని ఆమె జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆమనగల్‌లో 'క్యాచ్ ది రైన్' పోటీలు

### నీటి సంరక్షణకు పిలుపు



**ఆమనగల్లు, జూలై 17(సింగిడి):** కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'క్యాచ్ ది రైన్' కార్యక్రమం కింద ఆమనగల్ మున్సిపల్ కార్యాలయం వర్షపు నీటి సంరక్షణ పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు, పౌరులకు షార్ట్ వీడియోల పోటీలు ఉంటాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా వీడియోలను సమర్పించవచ్చు. జూలై 20లోపు ఎంట్రీలను ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలి. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. నీటి సంరక్షణ భావితరాలకు గొప్ప కానుక అని కమిషనర్ పిలుపునిచ్చారు.

# ఎడిటోరియల్

Editorial

## హాట్‌హాట్‌గా సాగనున్న పార్లమెంట్ !

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేవాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్యవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఎ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీ పై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది.

## సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయిత రెంటాల

రెంటాల గోపాలకృష్ణ ,( 5 సెప్టెంబర్ 1920 --18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ



ప్రకటనను సామాజిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాదకుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి.
పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది.సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది.

అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి.

విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి.

రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి -- పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు.
రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు. ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది -- సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.
రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు -- ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు -- అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తెలుగు చిత్రసీమ బామ్మ నిర్మలమ్మ

నిర్మల నటించిన తొలి నాటకం ప్రేమలీల', పద హారేళ్ల వయసులో నిర్మల అభిరుచికి తగ్గట్టుగా సక్కుబాయి' నాటకంలో నటించే అవకాశం వచ్చింది. తర్వాత పలు నాటకాల్లో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించి పలువురి ప్రశంసలు పొంద గలిగింది. రంగస్థలం మీద కేవలం నటించడమే కాకుండా శాస్త్రీయ సంగీతాన్ని సైతం రాగయుక్తంగా ఆలపించేవారు. 'ఆకలి' నాటకంలో బిచ్చగత్తె పాత్రను సహజశైలిలో ధరించినందుకు తన కళ్లు చెమ్మగిల్లాయని ప్రముఖ హిందీ



నటుడు పృథ్వీ, రాజ్ కపూర్ సభాముఖంగా ఆశీర్వదించడం మరిచి పోలేని మధురాను భూతిగా నిర్మల జ్ఞప్తికి తెచ్చుకునే వారు. అలాగే విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగ' నాటకంలో గిరిజ పాత్ర అపూర్వంగా ధరించావని అభినందించారాయన.

రంగస్థలం నుంచి ఆకాశవాణి విజయవాడ కేంద్రంలోను, అనేక నాటకసంస్థల్లోను, సొంతంగా ఏర్పాటు చేసిన ఉదయిని అండ్ రాఘవ కేంద్రంద్వారా నిర్మల పలు నాటకాలను ప్రదర్శించారు.

వాటిలో 'ఆకలి', 'ఆత్మవంచన', 'కరువు రోజులు 'చింతామణి', 'కన్యాశుల్కం', 'ఏకవీర', 'వేయిపడగలు' ఎన్నో ఉన్నాయి. రంగస్థలం మీద ఆకాశవాణి లోను ఆమెతో నటించిన వారిలో రామచంద్ర కాశ్యప్, కె.వి.ఎస్.కర్మ, రామన్న పంతులు, కె.విశ్వనాథ్, కె.వెంకటేశ్వరరావు తదితర ప్రముఖులందరు ఉన్నారు. ఇక 1948లో జరిగింది. ప్రతిభ సంస్థ ఘంటసాల బల రామయ్య స్వీయ దర్శకత్వంలో 'నిర్మించిన 'గరుడ గర్వభంగం' చిత్రంతో ఆమె తొలి సారి కెమెరా ముందు నిల్చున్నారు. అప్పుడు ఆ చిత్రానికి లభించిన పారితోషికం 500రూపాయలు. ఆమె తొలి చిత్రం నుంచి వెనుతిరిగింది లేనే లేదు. సినీనటి నిర్మలమ్మ తెలుగు చిత్రసీమలో బామ్మ పాత్రలకు ప్రాణం పోసిన సహజనటి. నిర్మలమ్మ వందలాది తెలుగు చిత్రాలలో నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా అనేక పాత్రలలో నటించిన ఆమె సహజ నటిగా గుర్తింపు పొందారు. నిర్మలమ్మ అసలు పేరు రాజమణి. 1920, జూలై 18న గంగయ్య, కోటమ్మ దంపతులకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా లోని మచిలీపట్నంలో జన్మించారు.
చిన్ననాటి నుంచి నాటకాలంటే ఆమెకు ప్రాణం. ఆదే ఆమె సినీరంగ ప్రవేశానికి ద్వారాలు తెరిచింది. 1943లో తన పదహారేళ్ల వయసులో గరుడ గర్వభంగం సినిమాలో చెలికత్తె పాత్రలో తొలిసారి నటించారు. ఆ తరువాత సుమారు వెయ్యి సినిమాల్లో నటించారు.

మూడు తరాలకు చెందిన నటులతో ఆమె నటించిన రికార్డు ఉంది. తన కన్నా పెద్దవారైన నాటి నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, యస్వీ రంగారావు ల నుంచి నేటి చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ వరకు ఎందరో హీరోలకు బామ్మగా, అమ్మగా నటించారు.



నిర్మలమ్మకు పందొమ్మిదేళ్ళ వయసులో జీవీ కృష్ణారావుతో వివాహం జరిగింది. ఈయన ప్రొడక్షన్ మేనేజర్ గా పని చేసేవాడు. ఆమె దత్త పుత్రిక పేరు కవిత. అల్లుడు డి.యస్. ప్రసాద్.

కాకినాడలో కరువు రోజులు అనే నాటకం చూసిన అలనాటి బాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్ కపూర్ నిర్మలమ్మను గొప్ప నటివవుతావని చెప్పాడు. ఈ సంఘటనను నిర్మలమ్మ చాలా సందర్భాల్లో గుర్తు చేసుకునేది.



నిర్మలమ్మ ఆడపెత్తనంలో హీరోయిన్ గా చేయాల్సింది. కానీ అది కుదర్లేదు. తర్వాత ఆమె గరుడ గర్వభంగంలో హీరోయిన్ గా చేసింది కానీ అంతగా ప్రాచుర్యం పొందలేదు. కానీ ఆమెకు నటిగా పేరు తెచ్చింది మాత్రం మనుషులు మారాలి అనే చిత్రం. ఆ సినిమా శతదినోత్సవాలకు వెళ్ళిన హిందీ నటుడు ప్రాణ్. నువ్వు శోభన్ బాబుకే అమ్మ కాదు. భారత్ కీ మా! అని అన్నాడు. అప్పట్లో ఆయనతో నాలుగు ముక్కలు హిందీలో మాట్లాడలేక పోయానని ఆమె విచారిస్తుండేది. ఏక వీర నాటకంలో గిరిక పాత్రను వేసిన నిర్మలమ్మను చూసిన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ... "పిచ్చిమొద్దూ! నీలో ఇంత నటన ఉందని అనుకోలేదు" అంటే అమాయకంగా నవ్విందట నిర్మలమ్మ.

శంకరాభరణం, యమగోల, పదహారేళ్ల వయసు, మావిచిగురు, గ్యాంగ్ లీడర్, శుభసంకల్పం, ఆపద్బాం ధవుడు, స్వాతిముత్యం తదితర చిత్రాల్లో వయసు మీద పడినా ఓపికతో నటించిన ఆమె అనంతరం ఆరోగ్య కారణాలతో నటన విరమించు కున్నారు. స్నేహం కోసం చిత్రం తరువాత ఆమె దాదాపు నటించటం మానేశారు. ఎస్వీ కృష్ణారెడ్డి బలవంతం మీద ఆమెను చివరి చిత్రం ప్రేమకు ఆహ్వానంలో నటించడానికి ఒప్పించాడు. మయూరి, సీతారామరాజు సినిమాలకు నంది అవార్డులను అందుకున్నారు.

"షూటింగ్ విరామ సమయంలో మమ్మల్ని తల్లిలా ఆదరించేది. అందకూ మేమందరం ఆమెను ఆప్యాయంగా నిర్మలమ్మ (నిర్మలంఅమ్మ) అని పిలుచుకునే వాళ్ళం". అని అక్కినేని నాగేశ్వరరావు తరుచుగా చెప్పేవారు.ఆరోగ్యం విషమించి హైదరాబాదులో 19 ఫిబ్రవరి, 2009 రోజున మృతిచెందారు.

*వృద్ధ పాత్రలలో జీవం పోసిన నిర్మలమ్మ తెలియని తెలుగు సినీ ప్రేక్షకులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో.. సినిమాల్లో ఆమెను చూడగానే మమతానురాగాలకు ప్రతిరూపమైన తల్లిగా, అమ్మమ్మగా, బామ్మగా, ఇంటికి పెద్ద దిక్కుగా, అందరికీ ఆత్మీయురాలిగా అనిపిస్తుంది. నిర్మలమైన, కరుణతో నిండిన స్త్రీమూర్తి ఆమెలో కనిపిస్తుంది. అలాంటి అరుదైన విశిష్టతను చేకూర్చుకున్న నటీమణి నిర్మలమ్మ. 1920, జూలై 18న గంగయ్య, కోటమ్మ దంపతులకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో జన్మించారు.*

**రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494**

## ఒకప్పుడు ఇంటి గడపకు చేరిన గుర్తింపు కార్డే... నేడు ఎందుకు ప్రశ్నార్థకమైంది?

డిజిటల్ ఇండియా నిర్మాణంలో ప్రభుత్వం జారీ చేసిన వివిధ గుర్తింపు పత్రాల వినియోగం, పౌరసత్వం, నివాస నిర్ధారణకు సంబంధించి కొన్ని సందర్భాల్లో తలెత్తుతున్న ప్రశ్నలు విధానపరమైన సమన్వయంపై చర్చకు దారితీస్తున్నాయి. "సొంత ఇల్లే అయినా ఇప్పుడు వేరే వాళ్ల ఇంట్లో ఉన్నట్లు అనిపిస్తోంది" అన్న కవి నిదా ఫాజ్లీ భావవ్యక్తీకరణ నేడు అనేక మంది సామాన్య పౌరుల మానసిక స్థితిని ప్రతిబింబిస్తున్నట్లు కనిపిస్తోంది. దశాబ్దాలుగా ఒకే గ్రామంలో లేదా పట్టణంలో నివసిస్తూ, ఎన్నికల్లో ఓటు వేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కొనసాగుతున్న వ్యక్తులను అదనపు పత్రాలతో తమ నివాసాన్ని లేదా ఇతర వివరాలను మరోసారి నిరూపించాల్సిన పరిస్థితి ఎదురైనప్పుడు, ప్రజల్లో సహజంగానే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ చర్చ కేవలం ఒక కార్డు గురించి కాదు, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు వ్యవస్థల పరస్పర సమన్వయం గురించి.

**వ్యవస్థాగత లోపాల భారమంతా పౌరుడిపైనేనా?**
ప్రస్తుత పరిస్థితికి పౌరులను మాత్రమే బాధ్యులుగా చూడడం న్యాయసమ్మతమైన దృక్పథం కాదని అనేక మంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 1969 నాటి జనన-మరణాల నమోదు చట్టం అమలులోకి వచ్చినప్పటికీ, దేశవ్యాప్తంగా చాలా సంవత్సరాల పాటు జననాల నమోదు పూర్తి స్థాయిలో జరగలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి ప్రసవాలు, పరిపాలనా లోపాలు, రికార్డుల నిర్వహణలో అసమానతలు వంటి కారణాల వల్ల అనేక మందికి జనన ధృవీకరణ పత్రాలు అందుబాటులో లేవని వివిధ ప్రభుత్వ గణాంకాలు, సర్వేలు గతంలో సూచించాయి. అలాంటి చారిత్రక వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా, ప్రతి ఒక్కరి వద్ద దశాబ్దాల నాటి పత్రాలే ఉండాలని భావించడం ఆచరణలో సమస్యలను సృష్టించే అవకాశం ఉంది. ప్రజలకు అందుబాటులో లేని పత్రాలను తప్పనిసరి ప్రమాణాలుగా మార్చే ముందు, గత పరిపాలనా లోపాలను కూడా సమీక్షించడం అవసరం.

భద్రతా అవసరాలు సరే.. సమతుల్యత ఎక్కడ?
అక్రమ వలసలను అరికట్టడం, నకిలీ పత్రాల వినియోగాన్ని నియంత్రించడం, సంక్షేమ పథకాల నిజమైన లబ్ధిదారులను గుర్తించడం, జాతీయ భద్రతను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలతో గుర్తింపు, నివాస నిర్ధారణ వ్యవస్థలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో పేర్కొన్నాయి. ఈ లక్ష్యాలు ప్రజాస్వామ్య పరిపాలనలో ముఖ్యమైనవే. అయితే భద్రతను బలోపేతం చేసే చర్యలు అమలు చేసే సమయంలో, నిజమైన పౌరులు అనవసర ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడటం కూడా అంతే కీలకమైన బాధ్యత. భద్రత, పౌరుల సౌలభ్యం మధ్య సమతుల్యతే సమర్థవంతమైన పాలనకు అసలు ప్రమాణం. గత దశాబ్దంలో భారత్ నిర్మించుకున్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. చట్టబద్ధమైన పరిమితులు, గోప్యతా హక్కులు, వ్యక్తిగత డేటా భద్రతను పరిరక్షిస్తూ, వివిధ ప్రభుత్వ డేటాబేస్‌ల మధ్య సమర్థవంతమైన అనుసంధానం ఏర్పాటు చేస్తే పౌరులపై పడుతున్న అనవసర పత్రాల భారం గణనీయంగా తగ్గించవచ్చు.

**గుర్తింపు పత్రాల మధ్య సమన్వయం ఎందుకు అవసరం?**
పాస్‌పోర్టు, ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ వంటి పత్రాలు ఒక్కొక్కటి వేర్వేరు చట్టాలు, వేర్వేరు ప్రయోజనాల కోసం రూపొందించబడ్డాయి. అందువల్ల వాటిలో ఏ ఒక్కటి కూడా అన్ని చట్టపరమైన అవసరాలకు లేదా ప్రతి సందర్భంలో పౌరసత్వానికి తుది సాక్ష్యంగా పరిగణించబడదు, ఏ పత్రానికి ఏ ప్రయోజనం ఉంటుందో సంబంధిత చట్టాలు, నిబంధనలు నిర్ణయిస్తాయి.

**'సిటిజన్ ఫస్ట్'తోనే బలపడే ప్రజాస్వామ్యం!**
ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం--పౌరుడి సంబంధానికి మూలం నమ్మకం. ఆ నమ్మకాన్ని బలపరిచే విధానాలే దీర్ఘకాలిక పరిష్కారాలకు దారి తీస్తాయి. పరిపాలనా సంస్కరణలు 'సిటిజన్ ఫస్ట్' సూత్రాన్ని కేంద్రంగా చేసుకుని ముందుకు సాగాలి. భద్రతా అవసరాలను రాజీపడకుండా, నిజమైన పౌరుల హక్కులు, గౌరవం, సౌలభ్యాన్ని సమానంగా కాపాడే వ్యవస్థే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది. ఒక బాధ్యతాయుతమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టబద్ధమైన అవసరాలకు అనుగుణంగా, పౌరులపై అనవసరమైన పునరావృత ధృవీకరణ భారం తగ్గించే విధానాలే ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేస్తాయి. అలాంటి వ్యవస్థ పౌరులను చట్టబద్ధమైన, పారదర్శకమైన, సాంకేతికంగా సమర్థమైన ప్రక్రియల ద్వారా గౌరవంగా గుర్తిస్తుంది. అదే డిజిటల్ భారతం సాధించాల్సిన తదుపరి లక్ష్యం.



**ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464**

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi శనివారం 18-7-2026

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**గోదావరిఖని, జూలై 17(సింగిడి):** రామగుండం కార్పొరేషన్ 4వ డివిజన్ గంగానగర్‌లో డీఎంఎఫ్టీ నిధులు రూ. 50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నగర మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్ కంకణాల మౌనిక రాజుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను మేయర్ ఆదేశించారు. ఎమ్మెల్యే చొరవతో మంజూరైన సుమారు రూ. 70 కోట్ల విలువైన రోడ్లు, కాలువల పనులను రానున్న రెండు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## సాత్విక్‌కు విద్యార్థి లోకం ఘన నివాళి



**గోదావరిఖని, జూలై 17(సింగిడి):** గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంచర్ల సాత్విక్‌కు మానవహారం నిర్వహించి ఘన నివాళులర్పించారు. లింగాపూర్ మోడల్ స్కూల్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సాత్విక్ కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన పీఈటీ, ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని హామీ ఇచ్చిన అధికారులకు, సహకరించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక ప్రోత్సాహకం

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై 17(సింగిడి):** జిల్లాలో ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాయితీలు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ప్రభుత్వం అందించే నాలుగేళ్ల రాయితీలతో పాటు అదనపు వ్యయాన్ని జిల్లా కలెక్టర్ నిధుల ద్వారా భరిస్తారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొంటూ రైతులు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలే..

### రాష్ట్ర యువ మోర్చ ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి



**జమ్మికుంట, జూలై 17 (సింగిడి):** బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో సువర్ణ ఫంక్షన్ హాల్ లో జమ్మికుంట పట్టణ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు, ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర యువ మోర్చ ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి గారు హాజరై, మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనలోనే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటుందని, మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, బిఆర్ఎస్ పార్టీ అవినీతి పాలన నే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూ ప్రజలను మోసం చేస్తుందని ఎద్దేవా చేశారు, రానున్న రోజుల్లో బిజెపి జెండా తెలంగాణ రాష్ట్రంలో ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు, ఈకార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, జీడి మల్లేష్, కైలాసకోటి గణేష్, రాజేష్ ఠాకుర్ సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.




## నీట్ ఫలితాల్లో అల్ఫోర్స్ చారిత్రాత్మక విజయం

తక్కువ మంది విద్యార్థులతోనే అధిక సంఖ్యలో ఉత్తమ ఫలితాలు సాధించడం అల్ఫోర్స్ ప్రత్యేకత అని డా. నరేందర్ రెడ్డి అన్నారు. వైద్య, భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు (ఐఐటీలు), జాతీయ సాంకేతిక విద్యాసంస్థలు (ఎన్ఐటీలు) లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దే దిశగా సంస్థ కృషి కొనసాగుతుందని తెలిపారు. విజేత విద్యార్థులను అభినందించిన ఆయన, ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమపై విశ్వాసం ఉంచి పిల్లలను అల్ఫోర్స్‌లో చేర్పిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

19 మంది విద్యార్థులకు 500కిపైగా మార్కులు..
సుమారు 100 మందికి వైద్య కళాశాలల్లో సీట్లపై ఆశలు
పటిష్ట శిక్షణ, క్రమశిక్షణే విజయ రహస్యం
అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా వి. నరేందర్ రెడ్డి




**కరీంనగర్, జూలై 17(సింగిడి):** జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్--2026) ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థలు మరోసారి విశిష్ట ప్రతిభ కనబరిచాయి. క్రమబద్ధమైన శిక్షణ, విద్యార్థుల పట్టుదల, అధ్యాపక బృందం నిరంతర పర్యవేక్షణతో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు అల్ఫోర్స్ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ పరీక్షలో డి. రిత్విక్ 647 మార్కులతో సంస్థలో అత్యధిక మార్కులు సాధించగా, సిద్ధాంత్ చతుర్వేది (564), సయ్యద్ మలాజుద్దీన్ (557), వసుల శ్రుత్విక (551), గులామ్ మహమ్మద్ హుస్సేన్ (548), బత్తుల అభిజ్ఞ (541), లింగంపల్లి అనంత్ సాయి (540), నార్ల శ్రీహిత (538), శ్రేయాంశ్ ద్వివేది (537), కొండ్ల అక్షిత (522), బొమ్మవరపు రుత్విక్ (515), జక్కుల శ్రీవైత్రి (512), టి. హర్షిత (509), సిద్దం సాత్విక (508), ఎ. సత్య బ్రాహ్మిణి (507), బి. అక్షర (505), నిద (502), గుంజేటి రిషిత (501), జహ్రా మాజీద్ (501) ప్రతిభ కనబరిచారు. వైద్యుల 30 ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా అందించిన లక్ష్యోద్దేశ్య బోధన ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. 19 మంది విద్యార్థులు 500కిపైగా మార్కులు సాధించగా, సుమారు 100 మంది వివిధ ప్రతిష్ఠాత్మక వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తక్కువ మంది విద్యార్థులతోనే అధిక సంఖ్యలో ఉత్తమ ఫలితాలు సాధించడం అల్ఫోర్స్ ప్రత్యేకత అని డా. నరేందర్ రెడ్డి అన్నారు. వైద్య, భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు (ఐఐటీలు), జాతీయ సాంకేతిక విద్యాసంస్థలు (ఎన్ఐటీలు) లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దే దిశగా సంస్థ కృషి కొనసాగుతుందని తెలిపారు. విజేత విద్యార్థులను అభినందించిన ఆయన, ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమపై విశ్వాసం ఉంచి పిల్లలను అల్ఫోర్స్‌లో చేర్పిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## బీఆర్ఎస్ చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

30 ఏళ్లుగా కొనసాగుతున్న మండపం పక్కనే కొత్త మండపం ఏర్పాటు కవ్వింపు చర్యేనని విమర్శ

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, జులై 17(సింగిడి):** కరీంనగర్‌లో శాంతియుతంగా, వైభవంగా జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాలను బీఆర్ఎస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే రాజకీయ వేదికగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆరోపించారు. మిత్ర యూత్ ఆధ్వర్యంలో కోడూరి అఖిల్ గౌడ్, ఆయన మిత్రబృందం గత 30 ఏళ్లుగా గణేష్ ఉత్సవాలను నిరాటంకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించడం, నవరాత్రులంతా భక్తుల పూజలతో పాటు నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించడం వారి ప్రత్యేకత అని పేర్కొన్నారు. 1999 నుంచి ఈ మండపంలో ఉత్సవాలు జరుగుతున్నాయని ఫొటో ఆధారాలు ఉన్నాయని, గతంలో స్థానిక ఎమ్మెల్యే కూడా ఇక్కడికి వచ్చి పూజలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం రాజకీయ ప్రయోజనాల కోసం వైఖరి మార్చడం బాధాకరమన్నారు. యువత బీజేపీకి, అఖిల్ గౌడ్‌కు మద్దతు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకే ఇలాంటి వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. 30 ఏళ్లుగా కొనసాగుతున్న ప్రధాన మండపానికి కేవలం 10--15 అడుగుల దూరంలో మరో మండపం ఏర్పాటు చేయడం కవ్వింపు చర్యేనని అన్నారు. దీనివల్ల అన్నదానం, భక్తుల రాకపోకలు, వాహనాల నిలిపివేతకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొత్త మండపాల ఏర్పాటులో తగిన దూరం పాటించేలా లేదా ప్రత్యామ్నాయ స్థలాలు సూచించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో బీజేపీ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందన్నారు. నగరపాలక సంస్థ తరఫున విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం సిద్ధంగా ఉందని తెలిపారు. పండుగలను రాజకీయాలకు దూరంగా ఉంచి, యువతలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని రాజకీయ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కే. ఏపీపీ చంద్ర, పొన్నం లక్ష్మి--మొండయ్య గౌడ్, బండ రమణారెడ్డి, తోట అనిల్ కుమార్, నాయకులు బండారి గాయత్రి, గడప నాగరాజు, శివకుమార్, మిత్ర యూత్ అధ్యక్షుడు కోడూరి అఖిల్ గౌడ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ పై క్షేత్రస్థాయిలో పరిశీలించండి

### కో-ఆర్డినేటర్ల ముఖ్య సమావేశంలో ప్రణవ్



**జమ్మికుంట, జులై 17 (సింగిడి):** హుజురాబాద్ పట్టణ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సర్ కో ఆర్డినేటర్ల ముఖ్య సమావేశంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బూత్ లో ఓట్ల సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని,ప్రతీ ఓటరు ముఖ్యం కాబట్టి బూత్ లెవెల్ ఏజెంట్లతో నిరంతరం మాట్లాడాలని కోరారు.క్రింది స్థాయిలో జరిగే సరళిని రాష్ట్ర పీసీసీ పరిశీలిస్తున్నారని,ఎన్నికల కమిషన్ పొడిగించిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కో ఆర్డినేటర్లను కోరారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి నియోజవర్గ స్థాయి ఇంచార్జ్ లకు,బిఎల్ఓ,సంబంధిత అధికారులకి సమాచారం అందించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం,కాంగ్రెస్ పార్టీ సీరియస్ గా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గస్థాయిలో మొదటి స్థాయిలో ఉండేలా ప్రతి కార్యకర్త,బిఎల్ఏ,కో ఆర్డినేటర్లు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,జిల్లా ఉపాధ్యక్షుడు,సర్ నియోజవర్గ కో ఆర్డినేటర్ సదయ్య,అన్ని మండలాల,పట్టణ అధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచులు,కో ఆర్డినేటర్లు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## గోదాముల నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయించాలి

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, డైరెక్టర్లు



**కరీంనగర్, జూలై 17(సింగిడి):** రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు, నిల్వ వసతులు కల్పించేందుకు నూతన గోదాములు, షెడ్ల నిర్మాణం కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, డైరెక్టర్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాటన్, ధాన్యాలు, పండ్ల మార్కెట్ యార్డుల్లో ప్రస్తుతం ఉన్న స్థలం రైతుల అవసరాలకు సరిపోవడం లేదని వారు వివరించారు. సమీకృత మార్కెట్ ఏర్పాటుకు రెండు ఎకరాల భూమిని, కేంద్రీకృత వంటశాల ఏర్పాటు కోసం రెండు బహిరంగ షెడ్లను కేటాయించడంతో మార్కెట్ యార్డులో స్థలాభావం ఏర్పడిందని తెలిపారు. ధాన్యం, పత్తి, మామిడి తదితర వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చే రైతులకు గోదాములు, షెడ్లు అత్యవసరమని పేర్కొంటూ, మార్కెట్ కమిటీ పరిధిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై జూలై 12న జరిగిన మార్కెట్ కమిటీ సాధారణ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ భూమి కేటాయింపు అంశాన్ని సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కలెక్టర్ సానుకూలంగా స్పందించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు పంజాల శ్రీనివాస్ గౌడ్, బోనాల శ్రీనివాస్, ఖాజా, రుద్ర రాము, మీసాల శంకర్, తపట్ల రాజు, జగ్గని కనకయ్య, రావణవేణి సంపత్, కాసవేణి భూమయ్య, మాలోతు మాలతి, శివనాధుని వెంకటేశ్వర్లు, పల్లా శివకుమార్ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకం

హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి

విలాసాగర్‌లో నిఘా నేత్రాలను ప్రారంభించిన పోలీసులు



**జమ్మికుంట, జులై 17 (సింగిడి) :** ఒక నిఘా నేత్రం వందమంది పోలీస్ లతో సమానమని నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి అన్నారు. శుక్రవారం జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలు జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వచ్చేసిన పోలీస్ అధికారులకు గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్ వారిని సాధారణంగా ఆహ్వానించి సన్మానం చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కంట్రోల్ రూమ్ ను ఏసిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలు తగ్గుతాయని నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారుతుందని ఆమె పేర్కొన్నారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు కనబడితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఏదైనా ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా నిందితులను త్వరగా గుర్తించ వచ్చునని ఆమె తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ, గ్రామస్తుల సహకారంతో పోలీసు అధికారుల సూచన మేరకు సుమారు లక్ష రూపాయల విలువ గల ఎనిమిది సీసీ కెమెరాలు గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగిందని సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామం ఆదర్శంగా నిలవాలని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విష్ణు తో పాటు జమ్మికుంట ఎస్సైలు పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

**విలాసాగర్ గ్రామం ఆదర్శంగా నిలవాలి**

సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంలో గ్రామ సర్పంచ్ తోపాటు గ్రామస్తుల సేవలు అభినందనీయమని నేరాల నియంత్రణలో నిఘా నేత్రాల పాత్ర కీలకంగా మారుతుందని ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే సీసీ కెమెరాల ద్వారా నిందితులను త్వరగా గుర్తించ వచ్చునని ఎసిపి అన్నారు. మండలంలోనే విలాసాగర్ గ్రామం ఆదర్శంగా నిలవాలని నేరారహిత గ్రామంగా రూపుదిద్దుకోవాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటులో తమ సహాయ సహకారాలు అందించిన గ్రామ సర్పంచ్ పాలకవర్గాన్ని ఆమె శాలువాతో సన్మానించి అభినందించారు.

## నియోజకవర్గంలో ఎంపీ ఈటల రాజేందర్ సుడిగాలి పర్యటన





పలు కుటుంబాలను పరామర్శించిన బిజెపి నేత

**జమ్మికుంట, జులై 17 (నినాదం) :** మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు మాజీ మంత్రి బిజెపి నాయకులు ఈటెల రాజేందర్ శుక్రవారం హుజరాబాద్ నియోజకవర్గం లో సుడిగాలి పర్యటన చేశారు. నియోజకవర్గంలో ఇటీవల మృతి పలు కుటుంబాలను పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఇల్లంతకుంట మండలం భోగంపాడు గ్రామానికి చెందిన మాజీ బిజెపి మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి మాతృమూర్తి సింగిరెడ్డి రాధమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పించారు. హుజురాబాద్ నమస్తే తెలంగాణ దినపత్రిక రిపోర్టర్ కొండల్ రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే వీణవంక మండలంలోని పలు గ్రామాలలో ఈటల విస్తృత పర్యటన చేసి బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు జమ్మికుంట మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యాం కంకణాల సురేందర్ రెడ్డి మాడ గౌతమ్ రెడ్డి సింగిరెడ్డి తిరుపతిరెడ్డి కొమ్ము అశోక్ శీలం శ్రీనివాస్ నసిరుద్దీన్ జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ గుర్రం పరశురామ్ గౌడ్ పసునూటి శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న పింగిలి రమేష్

**జమ్మికుంట, జులై 17 (సింగిడి) :** ఇల్లంతకుంట మండలం బిజెపి పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి మాతృమూర్తి సింగిరెడ్డి రాధమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళులు అర్పించిన కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. మండలంలోని భోగంపాడు గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాధమ్మ మృతిచెందగా శుక్రవారం ఆమె ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రమేష్ రాధమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తోడేటి శ్రీను రామంచ సంపత్ కవిడే కుమార్ రఘుపతి రేణిగుంట్ల కుమార్ యూత్ నాయకులు జెకె జోడు కుమారస్వామి రాపర్తి అఖిల్ గౌడ్ కొత్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## నాలుగు లైన్ల రహదారి పనులు వేగవంతం చేయాలి

ప్రజలకు ఇబ్బందులు లేకుండా భూసర్వే పూర్తి చేసి, అవసరమైతే గ్రామసభలతో నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశం

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూలై 17(సింగిడి ):** కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ప్రతిపాదిత నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, చిగురుమామిడి మండల కేంద్రం, ముల్కనూరు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ రహదారికి సంబంధించిన భూసర్వే, మార్గ నిర్ధారణ పనులను పరిశీలించారు. తొలి దశలో కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి నిర్మాణం వల్ల నివాస గృహాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలను ముందుగానే పరిశీలించి, అవసరమైతే ప్రత్యామ్నాయ బైపాస్ మార్గాలను ప్రతిపాదించాలని అధికారులకు సూచించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు అవసరమైతే గ్రామసభలు నిర్వహించి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. భూసర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లాలని, అభివృద్ధి పనులతో పాటు ప్రజల జీవన విధానానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, తిమ్మాపూర్, చిగురుమామిడి తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, రహదారులు--భవనాల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కిరణ్, సహాయ ఇంజనీర్ సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi శనివారం 18-7-2026






# అంతా బురదమయం..

20 ఏళ్లుగా నరకయాతన..!
తారు రోడ్డు అధ్వాన్నం
మోకాళ్ల లోతు బురదలో అవస్థలు..
పాలకులు, అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**మహాముత్తారం (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని నల్లగుంట--మీనాజీపేట నుంచి నర్సింగాపూర్ మీదుగా బోర్లగూడెం వరకున్న తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని మట్టి రోడ్డును తలపిస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రహదారి ప్రస్తుతం తారు పూర్తిగా ఊడిపోవడంతో గుంతలు, బురదతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే విద్యార్థులు, రైతులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే రహదారి మొత్తం బురదమయంగా మారి మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచిపోతుండటంతో రాకపోకలు కష్టసాధ్యమవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా, సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా పరిస్థితి మారిందని, ఇకనైనా అధికారులు స్పందించి రహదారిని తక్షణమే మరమ్మతు చేయాలని లేదా కొత్తగా నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# రూ.3 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు




**పెద్దపల్లి, జూలై 17(సింగిడి):** జిల్లా కేంద్రంలోని బందంపల్లి చెరువు కట్టను రూ. 3 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను శుక్ర వారం ఆయన మున్సిపల్ చైర్మన్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేలా చెరువు కట్టను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్‌తో పాటు తీగల వంతెనను కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు, గుత్తేదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నుగుల్లా మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ పురేళ్ల శైలజా సుధాకర్, ఇరిగేషన్ శాఖ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్ ఫొటో ఎక్కడ?

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రామగిరి రాజు



**మహాముత్తారం, జూలై 17 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ చిత్రపటం లేకపోవడం బాధాకరమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు రామగిరి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ, దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ చిత్రపటం ప్రభుత్వ కార్యాలయంలో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రకారమే ప్రజాప్రతినిధులు, అధికారులు తమ బాధ్యతలను నిర్వహిస్తున్నప్పటికీ, అలాంటి మహనీయుడిని విస్మరించడం విచారకరమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత చిత్రపటం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో గౌరవప్రదంగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆత్మపరిశీలన చేసుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే దిశగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని రామగిరి రాజు కోరారు.

# జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలి

సెప్టెంబర్‌లోపు తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి
రెండో విడతలో అర్హులైన పేదలకు ప్రాధాన్యం..
కరీంనగర్ జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశం
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, జూలై 17(సింగిడి):** ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో కరీంనగర్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. తొలి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్‌లోపు పూర్తిచేసి, పెద్ద ఎత్తున గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో తొలి విడత ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపికపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిర్మాణాల పురోగతి, బిల్లుల చెల్లింపులు, గృహప్రవేశాల నిర్వహణలో జిల్లా రాష్ట్రంలోనే ఉత్తమంగా నిలిచేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. రెండో విడతలో నిజమైన అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లను మంజూరు చేయాలని, ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి అర్హుడైన పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి పవన్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ గంగారాం, మండల అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడి సొంత భూమికి ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు?

ప్రజాధనం దుర్వినియోగం
బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లింగమల్ల సడవలిరావు




**మహాముత్తారం, జూలై 17 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులను కాంగ్రెస్ నాయకుడు సొంత భూమికి సీసీ రోడ్డు నిర్మాణం కోసం వినియోగిస్తున్నారని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లింగమల్ల సడవలిరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, మహాముత్తారం వెనుకబడిన మండలమని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పక్కనపెట్టి అధికార పార్టీ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రభుత్వ నిధులను వినియోగించడం తగదని విమర్శించారు. గ్రామంలోని స్మశానవాటికకు వెళ్లే రహదారి లేకపోవడంతో మృతదేహాలను తరలించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే, గ్రామ ప్రధాన అంగడి ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని, గత 20 ఏళ్లుగా అంగడి నిర్వహిస్తున్నప్పటికీ మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించలేదని అన్నారు. ఉపాధి హామీ నిధుల నుంచి సుమారు రూ. 5 లక్షలు వెచ్చించి కాంగ్రెస్ నాయకుడు సొంత భూమికి సీసీ రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపించారు. ప్రజా ధనాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం అభివృద్ధి కాదని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి సంబంధిత పనులను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గోదావరిఖనిలో వ్యభిచార ముఠాపై పోలీసుల దాడి

**గోదావరిఖని,జూలై17(సింగిడి):** పట్టణంలోని మార్కండేయ కాలనీ మార్గంలో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార దందాపై శుక్రవారం సాయంత్రం పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో వ్యభిచార ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కొంతకాలంగా విశ్వసనీయ సమాచారం ఆధారంగా దాడి చేపట్టిన పోలీసులు నిర్వాహకులు, బాధితులు, ఖాతాదారుల వివరాలను సేకరిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహా నెట్‌వర్క్ ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక ప్రకటన అనంతరం వెల్లడికానున్నాయి.



పోలీసులు దాడిచేసిన భవనం

# భరత్‌కు కొత్త ఆటో అందజేసిన కేంద్ర మంత్రి

హిందుత్వ నినాదాలతో ఉన్న ఆటోను స్వయంగా నడిపిన మంత్రి
లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్




**కరీంనగర్, జూలై 17(సింగిడి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హిందుత్వ నినాదాలతో ప్రచారం చేస్తున్న ఆటో డ్రైవర్ భరత్ కుమార్‌కు కొత్త ఆటోను అందజేశారు. ఇచ్చిన హామీ మేరకు పాత ఆటో స్థానంలో కొత్త ఆటోను అందిస్తూ, భరత్‌కు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తన నివాసం నుంచి భరత్‌కు చెందిన హిందుత్వ నినాదాలతో ఉన్న పాత ఆటోను స్వయంగా నడుపుతూ జ్యోతినగర్, మంకమ్మతోట, గీతాభవన్ చౌరస్తా, ప్రతిమ చౌరస్తా, బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, బోయవాడ మీదుగా లక్ష్మీనగర్ వరకు సుమారు ఐదు కిలోమీటర్లు ప్రయాణించారు. ఆటోలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, ఆటో డ్రైవర్ భరత్ పాల్గొన్నారు. వనపర్తి జిల్లాకు చెందిన భరత్ కుమార్ తన ఆటోపై హిందుత్వ నినాదాలు రాయించుకోవడంతో ఇటీవల హైదరాబాద్‌లో కొందరు వ్యక్తులు ఆటో కవర్‌ను ధ్వంసం చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడినట్లు బండి సంజయ్‌కు వివరించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మంత్రి భరత్‌కు ధైర్యం చెప్పి కొత్త ఆటో అందజేస్తానని హామీ ఇచ్చి, ఆ హామీని నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ హిందుత్వ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భరత్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం కరీంనగర్ నగరంలోని లక్ష్మీనగర్‌లో రూ. 70 లక్షల అంచనా వ్యయంతో యూఐడీఎఫ్ నిధుల ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే విద్యారణ్యపురి బతుకమ్మ సర్కిల్ వద్ద రూ. 48.50 లక్షలతో చేపట్టనున్న మరో సీసీ రోడ్డు నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి




జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి

**వనపర్తి ప్రతినిధి, జులై 17 (సింగిడి) :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాధార సాగుపై ఆధారపడే రైతులకు నష్టాలు కలగకుండా పంటల మార్పిడిపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉన్నందున వర్షాధారం పై ఆధారపడే రైతులు అధికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి పంటల మార్పిడి పై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు కేవలం వరి సాగుకే పరిమితం కాకుండా వారి భూభాగం, నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి ఉద్యాన పంటలు, కూరగాయలు, ఉల్లిపాయ, మినుములు, కందులు, వేరుశెనగ తదితర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాలకు అనుకూలమైన పంటలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించి, లాభదాయకమైన పంటల సాగు వైపు మళ్లించేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అధికారులు ఆయిల్ పామ్ సాగు విస్తరణ పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి ఆయిల్ పామ్ ప్రోత్సాహానికి లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు.

ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయం లభించే అవకాశాలను వివరించి రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. రాబోయే 15 రోజుల పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సెలవులు లేకుండా పూర్తిస్థాయిలో గ్రామాల్లో పర్యటిస్తూ రైతులను చైతన్యపరిచి ఉద్యాన పంటల విస్తరణకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, ప్రియునిక్ సంస్థ సిపిఓ సింగారెడ్డి, ఏవోలు, ఏఈఓ లు తదితరులు పాల్గొన్నారు.

# తండాల అభివృద్ధియే ధ్యేయం

గ్రామపంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తా...
సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి



**డోర్నకల్ /మరిపెడ, జులై 17(సింగిడి):** మరిపెడ మండలం గాలివారి గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని టీలావత్ తండాలో సుదీర్ఘకాలంగా తండావాసులు ఎదురు చూస్తున్న సిసి రోడ్డు పనులను ఈరోజు అధికారికంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బల్లెం ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి, ఎల్లబోయిన సోమయ్య,వార్డ్ సభ్యులు, తండావాసులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీలోని ప్రతి తండా,ప్రతి వీధి అభివృద్ధి చెందాలన్నదే మా లక్ష్యంగా పెట్టుకున్నామని, రోడ్లు,తాగునీరు,వీధి దీపాలు వంటి ప్రాథమిక సౌకర్యాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఇది కేవలం ఒక రోడ్డు మాత్రమే కాదు,తండా అభివృద్ధికి వేసిన తొలి అడుగు అని ఆమె అన్నారు. రాబోయే రోజుల్లో గాలివారి గూడెం పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం తీసుకొని పని చేస్తామని స్పష్టం చేశారు. ఎన్ఆర్ఈజిఎస్ నిధులు 5 లక్షలతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యదర్శి, ప్రజలు మరియు వార్డ్ సభ్యులు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు పనులు ప్రారంభం కావడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. తండా వాసులు సర్పంచ్ మరియు పంచాయతీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సైన్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి

జెవివి రాష్ట్ర సభ్యులు షేక్ జాఫర్



**హుజూర్ నగర్,జూలై 17 (సింగిడి ):** స్థానిక తెలంగాణ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ హుజూర్నగర్ నందు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సి హెచ్ రమేష్ అధ్యక్షతన విద్యార్థులకు సైన్స్ ప్రయోగాల పట్ల అభిరుచి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యులు షేక్ జాఫర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కలకుంట్ల సైదులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి షేక్ జాఫర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే సైన్స్ అంశాలపై మరియు చుట్టూ జరుగుతున్న అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, అవి ఎందుకు ఎలా జరుగుతున్నాయి అనేది పరిశీలించాలని, ఒక అంశం పట్ల దృఢ నిశ్చయానికి రావాలంటే ఎన్నోసార్లు పరిశీలించి వాటిని రుజువు పరుచుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. సమాజ మార్పుకు అనుగుణంగా సైన్స్ ఎదుగుతున్నదని ఈ సైన్స్ అవగాహన చేసుకోవడం భావి భారత పౌరులుగా మీరు అంది పుచ్చుకోవాలని తెలిపారు. అనంతరం వివిధ చిన్నచిన్న సైన్స్ ప్రయోగాలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వాకింగ్ వర్సెస్ రన్నింగ్..

## బరువు తగ్గడానికి ఏది బెస్ట్..?



ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతున్న నేటి కాలంలో బరువు తగ్గడానికి ప్రతి ఒక్కరూ ఎంచుకునే ప్రాథమిక మార్గాలు నడక లేదా పరుగు. అయితే వీటిలో ఏది వేగంగా ఫలితాన్ని ఇస్తుంది?

కీళ్ల నొప్పులు ఉన్నవారు పరిగెత్తవచ్చా? తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలంటే ఏం చేయాలి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను ప్రముఖ వైద్య సంస్థల పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

మీ లక్ష్యం తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలను దహనం చేయడం అయితే పరుగు అత్యుత్తమ మార్గం. జర్నల్ ఆఫ్ ఒబేసిటీ అధ్యయనం ప్రకారం.. ఒకే దూరాన్ని నడిచే వారితో పోలిస్తే, పరుగెత్తే వారు వేగంగా శరీర కొవ్వును కోల్పోతారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్ నివేదిక ప్రకారం.. 70 కిలోల బరువున్న వ్యక్తి 30 నిమిషాల పరుగు ద్వారా సుమారు 300 కేలరీలను ఖర్చు చేయవచ్చు. అదే సమయంలో చురుకైన నడక ద్వారా కేవలం 140 నుండి 160 కేలరీలు మాత్రమే ఖర్చవుతాయి.

పరుగుతో పోలిస్తే నడకలో తక్కువ కేలరీలు ఖర్చవుతున్నాయని దీనిని తక్కువ అంచనా వేయలేం. అధిక బరువు ఉన్నవారికి, కీళ్ల నొప్పులతో బాధపడేవారికి లేదా కొత్తగా వ్యాయామం ప్రారంభించే వారికి నడక అత్యంత సురక్షితమైనది. పరుగు వల్ల త్వరగా అలసిపోయే అవకాశం ఉంది. కానీ నడకను ఎక్కువ సేపు సులభంగా చేయవచ్చు. మీరు ప్రతిరోజూ గంటసేపు చురుగ్గా నడిస్తే, పరుగు ద్వారా వచ్చే ఫలితాలనే సాధించవచ్చు.

మీరు దేనిని ఎంచుకోవాలనేది మీ శరీర తత్వం, జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. వేగంగా బరువు తగ్గడానికి మీకు ఓపిక, కీళ్ల సమస్యలు లేకపోతే పరుగు ఎంచుకోండి. మీకు కీళ్ల నొప్పులు ఉన్నా లేదా వ్యాయామం భారంగా అనిపించకూడదు అనుకున్నా వేగంగా నడవడం ఉత్తమం.

ఏ వ్యాయామమైనా నిలకడ అనేది ముఖ్యం. పరుగు అయినా, నడక అయినా ప్రతిరోజూ క్రమం తప్పకుండా చేసినప్పుడే ఆశించిన ఫలితాలు అందుతాయి. మీ శరీర సామర్థ్యాన్ని బట్టి మీకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని ఆరోగ్యంగా మారండి.



# దొండకాయ పెరుగు పచ్చడి

## ఇలా చేస్తే.. అస్సలు వదలరు!

ముందుగా దొండకాయలను తీసుకుని బాగా క్లీన్ చేసి, చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఒక గిన్నె లోకి తీసుకోవాలి. వీటిని ఫ్యాన్ కింద ఎక్కువ సేపు ఆరబెడితే పెరుగు పచ్చడి టేస్టీగా ఉంటుంది.




**కాబట్టి, మీరు కూడా ఈ టిప్ ఫాలో అవ్వండి.**

ఇప్పుడు గ్యాస్ పొయ్యి పెనం పెట్టి కొద్దిగా నూనె వేసి అది కాగిన తర్వాత దొండకాయ ముక్కలను వేసి గోల్డ్ రంగులోకి మారే వరకు స్టవ్ మీదే పెట్టి బాగా వేయించుకోవాలి. అలా వేయించిన తర్వాత వీటిని ఒక ప్లేట్ లోకి తీసుకోవాలి.

నాలుగు కప్పులు పెరుగును ఒక గిన్నెలోకి తీసుకుని, దానిలో ఒక గ్లాస్ నీళ్ళు పోసి మజ్జిగలా చేసుకోవాలి, దానిలో మిక్సీలో పట్టిన మసాలా పేస్ట్, కొద్దిగా పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి.

ఈ పెరుగును తీసుకుని దొండకాయలున్న పెనంలో పోసి మీడియం మంట పై తక్కువ ఫ్లేమ్ తో పది నిముషాలు పాటు స్టవ్ మీదే ఉడికించి ముక్కలకు పెరుగు పట్టే వరకు అలాగే వేయించండి.

**తాలింపు పెట్టుకోవాలి:**

చివర్లో కొద్దిగా 5 ఎండుమిర్చి ముక్కలు , కొద్దిగా ఇంగువ, అర టీ స్పూన్ ఆవాలు, అర టీ స్పూన్ జీలకర్ర, కరివేపాకు, కొత్తిమీర వేసి బాగా వేయించి ఈ మిశ్రమాన్ని దొండకాయ పెరుగు పచ్చడిలో వేసుకుంటే టేస్ట్ అదిరిపోతోంది. వేసవి కాలంలో అయితే ఇది సూపర్ అండ్ బెస్ట్ రెసిపీ.

# ఆవు అరుపులో అమ్మ పిలుపు!



భారతదేశంలోని పల్లెటూళ్లలో తెల్లవారుజామున గోమాత అరుపుతోనే రోజు మొదలవుతుంది. తరతరాలుగా వస్తున్న మన సంస్కృతిలో ఆవును ఇంటి మహాలక్ష్మిగా భావించి, పూజ గదిలో దేవుడికి ఇచ్చే గౌరవాన్నే ఆవుకు కూడా ఇస్తారు. రైతులు తమ పొలాల్లో కష్టపడే ఎడ్లను, పాలిచ్చే ఆవులను తమ సొంత బిడ్డల కంటే ఎక్కువగా ప్రేమించడం మనం నిత్యం చూస్తుంటాం. ఒక ఆవు దూడను ప్రసవించినప్పుడు ఆ ఇంట్లో పసిపాప పుట్టినంత సంబరం నెలకొంటుంది. గ్రామీణ ప్రజలు ఆవులకు ముద్దు పేర్లు పెట్టుకుని, వాటితో మనసు విప్పి మాట్లాడుతుంటారు. ఈ అనుబంధం ఎంత గాఢమైనదంటే, ఆవు అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆందోళన చెందుతుంది. ఈ సుందరమైన బంధం మానవత్వానికి, మూగజీవాల పట్ల ఉండే అపారమైన కరుణకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

**ఆర్థిక స్వావలంబనలో కామధేనువు**


గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఆవు ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ, రైతుకు దానిపై ఉండేది కేవలం వ్యాపార దృక్పథం కాదు, అది ఒక ఆత్మీయ అనుబంధం. పండుగ సమయాల్లో, ముఖ్యంగా సంక్రాంతి వంటి పర్వదినాల్లో ఆవులను అందంగా అలంకరించి, వాటికి ప్రత్యేకమైన వంటకాలు తినిపించి కృతజ్ఞత తెలుపుకుంటారు. ఆవు పేడతో ఇళ్లను అలుకుకోవడం, వాకిట్లో ముగ్గులు వేయడం ద్వారా ఇంటికి శుభం కలుగుతుందని నమ్ముతారు. ప్రకృతి ప్రసాదించిన ఈ గొప్ప జీవి నుండి వచ్చే పాలు, పెరుగు, నెయ్యి వంటివి మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆవు ఇచ్చే ప్రతిదీ సమాజానికి ఉపయోగపడేదే కావడంతో, దానిని ఒక 'కామధేనువు'గా భావిస్తూ భక్తితో కొలుస్తారు. ఈ క్రమంలోనే ఆవుల పెంపకం అనేది ఒక వృత్తిగా కాకుండా, ఒక జీవన విధానంగా, ఒక బాధ్యతగా గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతోంది.

**నిశ్శబ్ద ప్రేమకు ప్రతిరూపం**

నేటి యాంత్రిక యుగంలో కూడా పల్లె ప్రజలు ఆవులతో గడిపే సమయాన్ని ఒక గొప్ప మానసిక ప్రశాంతతగా భావిస్తారు. పచ్చని పొలాల్లో ఆవులను మేతకు తీసుకెళ్లే సమయంలో పశువుల కాపరులకు, ఆ మూగజీవాలకు మధ్య ఏర్పడే అవినాభావ సంబంధం వర్ణనాతీతం. ఆవుల మెడలోని గంటల చప్పుడు పల్లెటూరి వాతావరణానికి ఒక ప్రత్యేకమైన లయను ఇస్తుంది. పట్టణాల్లో పెరిగే వారికి ఇది కేవలం ఒక దృశ్యం కావొచ్చు, కానీ గ్రామీణులకు అది ఒక భావోద్వేగం. ఆవు కళ్లలో ఉండే నిశ్శబ్ద ప్రేమను, అది చూపే విశ్వాసాన్ని రైతులు మాత్రమే గుర్తించగలరు. ఆవుల సాన్నిధ్యంలో ఉండటం వల్ల ఒత్తిడి తగ్గి, మనసుకి నెమ్మది కలుగుతుందని అనేక అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. అందుకే, ఆవును ప్రేమించడం అంటే ప్రకృతిని ప్రేమించడమే అని మన గ్రామీణ సంస్కృతి చాటిచెబుతోంది.

**గో సంరక్షణే జీవన సంరక్షణ**

ఆవుకు మనిషికి మధ్య ఉన్న ఈ అనుబంధం ప్రాచీన కాలం నుండి నిరంతరాయంగా సాగుతున్న ఒక పవిత్రమైన ప్రయాణం. ఆవులను హింసించకుండా, వాటిని గౌరవప్రదంగా చూసుకోవడం మన బాధ్యత అని ప్రతి గ్రామీణ గడప మనకు గుర్తుచేస్తుంది. యువత కూడా ఈ గొప్ప సంస్కృతిని అర్థం చేసుకుని, గో సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆవు పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండటంతో పాటు, సేంద్రియ జీవనశైలికి పునాది పడుతోంది. ఎక్కడైతే ఆవు సంతోషంగా ఉంటుందో, అక్కడ సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని మన పెద్దల నమ్మకం. ఈ సానుకూల దృక్పథమే తరతరాలుగా ఆవులను మన కుటుంబ సభ్యులుగా మలుచుకునేలా చేసింది. ఈ అపురూపమైన బంధాన్ని కాపాడుకోవడం మనందరి కర్తవ్యం.



వి. రాజేందర్ నాథ్
ఫ్రీలన్స్ జర్నలిస్ట్
9440287170

# ఆరోగ్యంగా ఉండాలంటే..

## జిమ్‌లో గంటల తరబడి గడపక్కర్లేదు..!







**రాత్రికి రాత్రే జిమ్‌లో గంటల తరబడి గడపక్కర్లేదు, ఖరీదైన డైట్ ప్లాన్‌లు పాటించక్కర్లేదంటున్నారు వైద్యనిపుణులు. మన దైనందిన జీవితంలో చేసుకునే చిన్న చిన్న మార్పులే మన ఆరోగ్యాన్ని ఆకాశానికి తీసుకెళ్తాయి. "పర్ఫెక్షన్ కంటే కన్సిస్టెన్సీ (స్థిరత్వం) ముఖ్యం" అని ఆయన చెబుతున్నారు. మరి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆ 8 సూత్రాలు ఏంటో తెలుసుకుందాం.**

నిద్రలేవగానే సోషల్ మీడియా స్క్రోలింగ్ చేయడం వల్ల శరీరంలో 'కార్టిసాల్' (ఒత్తిడి హార్మోన్) స్థాయిలు పెరుగుతాయి. దీనికి బదులుగా కృతజ్ఞతా భావంతో రోజును ప్రారంభించండి. ఇది నాడీ వ్యవస్థను ప్రశాంతపరిచి, జీర్ణక్రియకు సహకరిస్తుంది.

ఉదయాన్నే కనీసం 10 నిమిషాల పాటు ఎండలో గడపండి. ఇది మీ శరీర అంతర్గత గడియారాన్ని రీసెట్ చేస్తుంది, విటమిన్-డిని అందిస్తుంది . మీ మూడ్‌ను మెరుగుపరుస్తుంది.భారీ భోజనం చేసిన తర్వాత చిన్నపాటి నడక జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా, తిన్న తర్వాత వచ్చే బద్ధకాన్ని వదిలిస్తుంది. పెరుగు, దహీ, కిమ్చి లేదా గంజి వంటి పదార్థాలను మీ డైట్‌లో చేర్చుకోండి. ఇవి సహజ సిద్ధమైన ప్రోబయోటిక్స్‌గా పనిచేసి మీ పేగుల్లోని మంచి బ్యాక్టీరియాను పెంచుతాయి.

**దీనివల్ల జీర్ణ సంబంధిత సమస్యలు దరిచేరవు.**

పసుపు, అల్లం, జీలకర్ర, సోంపు మరియు మిరియాలు కేవలం రుచి కోసం మాత్రమే కాదు.. ఇవి శరీరంలోని వాపును తగ్గించి, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రాత్రి 8 గంటల నుండి ఉదయం 8 గంటల వరకు ఏమీ తినకుండా ఉండటం వల్ల మీ జీర్ణవ్యవస్థకు తగినంత విశ్రాంతి లభిస్తుంది. ఈ సమయంలో శరీరం తనను తాను రిపేర్ చేసుకుంటుంది.బ్లూబెర్రీస్, స్ట్రాబెర్రీస్ వంటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఒత్తిడిని తగ్గించి, మెదడును చురుగ్గా ఉంచుతాయి. అయితే వీటిని తినే ముందు శుభ్రంగా కడగడం మర్చిపోవద్దు. ఒకరికి పని చేసిన డైట్ అందరికీ పని చేయదు. ప్రతి ఒక్కరి శరీరం, జీర్ణవ్యవస్థ వేరువేరుగా ఉంటాయి. కాబట్టి మీ శరీరానికి ఏది పడుతుందో గమనించి, దాని ప్రకారం ఆహారాన్ని ఎంచుకోవడం నేటి కాలంలో చాలా ముఖ్యం.

# LPGపై కేంద్రం కీలక నిర్ణయం!

## రాష్ట్రాలకు సరఫరా 20 శాతం పెంపు

**ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా LPG కొరత అనే గందరగోళంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాలకు కమర్షియల్ LPG సరఫరాను 20 శాతం పెంచుతూ తాజా ఆదేశాలు జారీ చేసింది.**



ఈ నిర్ణయం ద్వారా ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై ఉన్న ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాస్తూ, కమర్షియల్ గ్యాస్ సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు వంటి వ్యాపార సంస్థలకు నిరంతరంగా గ్యా+ అందేలా చూడాలని సూచించింది. గ్యాస్ కొరత కారణంగా వ్యాపారాలు నిలిచిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కూడా కేంద్రం పేర్కొంది.

ఇదే సమయంలో వలస కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వలస కార్మికులకు ఉచితంగా 5 కేజీల సిలిండర్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపింది. ఇది తక్కువ ఆదాయం గల కుటుంబాలకు గ్యాస్ ఖర్చు భారాన్ని తగ్గించడంలో సహాయపడనుంది. ఇటీవలి కాలంలో గ్యాస్ వినియోగం పెరుగుతుండటం, సరఫరా గొలుసులో చోటు చేసుకుంటున్న సమస్యలు, అలాగే వ్యాపార రంగం నుంచి వస్తున్న డిమాండ్ పెరగడం వంటి అంశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సరఫరా పెంపుతో మార్కెట్‌లో స్థిరత్వం వస్తుందని, ధరలపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# స్టాక్ మార్కెట్
Stock Market

### చేతులు కలపనున్న

## వొడాఫోన్-ఐడియా, బీఎస్ఎన్ఎల్..!

అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా , భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ జట్టు కట్టనున్నాయి. టవర్లు, ఫైబర్ కేబుళ్లు, స్పెక్ట్రమ్‌ను ఈ రెండు సంస్థలు షేర్ చేసుకోనున్నాయి. కవరేజ్ మెరుగుపర్చేందుకు, డబ్బు ఆదా చేసే ఉద్దేశంతో ఈ రెండు సంస్థలు ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. నెట్‌వర్క్ నాణ్యతను మెరుగుపర్చేందుకు, 5జీ విస్తరణను వేగవంతం చేసేందుకు ఈ చర్య ఉపయోగపడొచ్చని భావిస్తున్నారు. ఒకట్రెండు కంపెనీలు ఆధిపత్యం చెలాయించకుండా టెలికాం మార్కెట్‌లో పోటీ ఉండేలా ఇది దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 4జీ సైట్స్, అప్‌గ్రేడ్‌ల కోసం ఇవి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీలు జట్టు కట్టడం వల్ల గ్రామీణప్రాంతాల్లో కూడా కవరేజీ మెరుగుపడనుందని తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ రంగ సంస్థ కాగా.. వీఐలో కేంద్రానికి 49 శాతం వాటా ఉంది.




# రూ. 10.69 లక్షలకే స్కోడా కుషాక్ ఫేస్‌లిఫ్ట్

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ స్కోడా ఆటో ఇండియా ఎస్‌యూవీ విభాగంలో కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ.10.69 లక్షలు (ఎక్స్ షోరూం)గా కంపెనీ నిర్ణయించింది. టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.18.99 లక్షలు (ఎక్స్ షోరూం)గా కంపెనీ పేర్కొంది. క్లాసిక్, సిగ్నేచర్, స్పోర్ట్‌లైన్, ప్రెస్టీజ్, మాంటే కార్లే వంటి 5 వేరియంట్‌లలో ఈ మోడల్‌ను తీసుకొచ్చారు. మార్కెట్లో ఉన్న రెనో డస్టర్, హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్ వంటి కార్లకు గట్టి పోటీ ఇవ్వనుంది.




కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను కొత్తగా డిజైన్ చేశారు. స్కోడా కొడియాక్ మోడల్ తరహా గ్రిల్, డీఆర్ఎల్ఎస్ హెడ్‌లైట్స్‌తో పాటు స్కోడా బ్రాండ్ ఎల్ఈడీ టెయిల్ లైట్స్‌ను ఇచ్చారు. కారు లోపల యాంబియంట్ లైటింగ్, 2 స్పోక్ స్టీరింగ్ వీల్, 10.25 అంగుళాల డిజిటల్ కాక్‌పిట్‌తో పాటు ఏఐ అసిస్టెంట్‌తో కూడిన 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉంది. ఈ సెగ్మెంట్‌లో మొదటి సారి వెనుక సీట్లో మసాజ్ ఫంక్షన్‌ను తీసుకొచ్చారు. పనరోమిక్ సన్‌రూఫ్, పవర్ అడ్జస్టబుల్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్ లెస్ ఛార్జింగ్ స్టేషన్, ఆటోమెటిక్ క్లైమెట్ కంట్రోల్ ఫీచర్లను అమర్చారు.

భద్రత కోసం ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, పార్కింగ్ కెమెరా, పార్కింగ్ సెన్సార్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఆటో డిమ్మింగ్ ఇన్‌సైడ్ రియర్ వ్యూమిర్రర్ ఇచ్చారు. ఈ మోడల్స్‌లో అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్, 360 డిగ్రీల కెమెరా లేకపోవడం గమనార్హం. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 6 స్పీడ్ మాన్యువల్ లేదా 8 స్పీడ్ టార్క్ కన్వర్టర్ ఆటోమెటిక్ గేర్ బాక్స్ ఆప్షన్లు ఉన్నాయి. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 7 స్పీడ్ డీసీటీ ఆప్షన్లలో కారు లభిస్తుంది.

# ట్విటర్ కొనుగోలులో మస్క్ మోసాలు..!

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 2022లో ట్విటర్ ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మస్క్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించినట్లు జ్యూరీ నిర్ధరించింది. ట్విటర్ కొనుగోలు చేయడానికి కొన్ని నెలల ముందు ఉద్దేశపూర్వకంగా పెట్టుబడిదార్లను గందరగోళానికి గురిచేసినట్లు తెలిపింది. దానివల్ల ట్విటర్ షేర్ల విలువ తగ్గినట్లు వెల్లడించింది. అయితే స్టాక్ విలువను తగ్గించేందుకు కూడా కుట్ర పన్నారనే ఆరోపణలను తోసిపుచ్చింది. మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేయకముందు దాఖలైన దావాపై విచారణ జరిపిన జ్యూరీ ఈ వ్యాఖ్యలు చేసింది.



ట్విటర్ కొనుగోలు ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు మే 2022లో మస్క్ చేసిన రెండు ట్వీట్లు, ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు, పలు ప్రకటనలతో ట్విటర్ వాటాదారులు తమ షేర్లను అమ్ముకునేలా చేశారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై శాన్ ఫ్రాన్సిస్కో ఫెడరల్ కోర్టులో మార్చి 2న విచారణ ప్రారంభమయ్యింది. దీనిపై విచారణ జరిపిన తొమ్మిది మంది సభ్యుల జ్యూరీ 2022లో మస్క్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించినట్లు పేర్కొంది. మస్క్ కొనుగోలు చేయడానికి ముందు ట్విటర్ షేర్లు అమ్ముకున్న వాటాదారులకు నష్టపరిహారం చెల్లించాలని టెస్లా అధినేతను ఆదేశించింది.

**యుద్ధం వేళ.. ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా**

కాగా తాను ట్విటర్‌ను కొనుగోలు చేయాలని అనుకున్నప్పుడు అందులో నకిలీ ఖాతాల సంఖ్య అధికంగా ఉందని మస్క్ తెలిపారు. దీంతో కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గడానికి ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ట్విటర్ డెలావేర్‌లోని కోర్టును ఆశ్రయించడంతో.. తన నిర్ణయాన్ని మార్చుకున్నానన్నారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగు ఓ నిజం
Singidi
శనివారం 18-7-2026

## గుడుంబా తయారీపై
# కోటపల్లి పోలీసుల దాడి
### 35 లీటర్ల గుడుంబా స్వాధీనం--ముగ్గురిపై కేసులు నమోదు



**చెన్నూరు (సింగిడి)** ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారీ విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు కోటపల్లి ఎస్ ఐ రాజశేఖర్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం అర్జునగుట్ట గ్రామంలోని పలు అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారని తెలిపారు ఈ తనిఖీలలో మొత్తం 35 లీటర్ల ప్రభుత్వ నిషేధిత గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 300 లీటర్ల బెల్లపు పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే తయారీ సామగ్రిని కూడా సీజ్ చేశారని కోటపల్లి ఎస్ ఐ తెలిపారు అనంతరం నిందితుల వివరాలు వెల్లడించారు ఆకుదారి అనిల్ (20)10 లీటర్ల గుడుంబా స్వాధీనం; 300 లీటర్ల బెల్లపు పానకం ధ్వంసం అట్టేలా మల్లయ్య, (62) 15 లీటర్ల గుడుంబా స్వాధీనం ఆకుదారి సదువలి, (40)–10 లీటర్ల గుడుంబా స్వాధీనం.పట్టుబడిన ముగ్గురు నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఐ తెలిపారు అనంతరంఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ, గ్రామాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబా కారణంగా అనేక కుటుంబాలు ఆర్థిక, ఆరోగ్య పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే ఇలాంటి అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు ఈ ఆపరేషన్‌లో ఎస్‌ఐతో సహా హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు,టీజీఎస్పీ కానిస్టేబుళ్లు మల్లేష్, సాయికృష్ణ మరియు నరేష్ పాల్గొన్నారు...

## దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు




**మల్హర్,(సింగిడి):**మల్హర్ మండలం పెద్దతూండ్ల దుద్దిల్ల శ్రీపాదరావు 89వ జయంతిని పురస్కరించుకుని గాదం పల్లి ప్రాథమిక పాఠశాల యందు అడవిపల్లి, గాదం పల్లి అంగన్వాడి స్కూల్ పిల్లలకు క బుక్స్ మెటీరియల్ పేలట్స్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర స్టేట్ కార్పోరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్‌రెడ్డి రావడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకార్యకర్తలు సర్పంచులు యువజన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీలు మాజీ సింగిల్ విండో చైర్మన్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎస్టీసెల్ బీసీసెల్ నాయకులు కార్యకర్తలు పాల్గొని జయంతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది

## సంపత్‌రావుకు డాక్టరేట్ ప్రదానం



**మల్హర్,(సింగిడి)** సోషల్ సర్వీస్‌లో భాగంగా వీరమ నేని సంపత్ రావు సేవలను గుర్తించి ఆదివారం చెన్నై లోని తమిళ్ కల్చరర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫార్మర్ సివిల్ జడ్జి వెంకటే షన్, సినీనటి నిరోష,అండర్ సెక్రెటరీటు గౌట్ లైసెన్ డాక్టర్ డి ఆనంద రాజ్, కౌన్సిలర్ కె నాగరాజు, వైస్ కౌన్సిలర్ జె మాణిక్ ఆనందరాజ గారి చేతుల మీదుగా ఆదివారం సంపత్ రావు డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి తనకు డాక్టరేట్ ప్రధానం చేసిన పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా అంచలం చలుగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి ఉన్నతస్థాయి ఎదగ దానికి సహకరించిన తన తోటి సహచరులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ డాక్టరేట్ పట్టా తనకు మరింత బాధ్యతను పెంచిం దని గుర్తు చేశారు.తనవంతుగాప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్ బంటు శ్రీనివాస్‌కు సన్మానించిన మాజీ కౌన్సిలర్



**మిర్యాలగూడ (సింగిడి)** మిర్యాలగూడ పట్టణంలోని 46 వార్డు మాజీ కౌన్సిలర్ సలీం ఆధ్వర్యంలో సోమవారం ఆయన నివాసంలో నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్, 46వ వార్డు కౌన్సిలర్ బంటు శ్రీనివాస్ కు బొకేలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కౌన్సిలర్ కు సలీం సీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ లతీఫ్, సమీఖాద్రి, రియాజ్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రహీం, అలీ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వలిగొండ, (సింగిడి)** నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం కోసం వలిగొండ మండలంలోని వేములకొండ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని వేములకొండ, చిత్తాపురం , గోపరాజపల్లి, దుప్పెల్లి, వెంకటాపురం గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు 3 ఫేస్ సప్లై ను మంగళవారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ శాఖ ఏఈ జోగుల నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు.

# రాహుల్ గాంధీ రాకకోసం ప్రతిపక్షాల కమ్యూనిస్టుల ముందస్తు అరెస్ట్





**వికారాబాద్,(సింగిడి)** వికారాబాద్ జిల్లా కేంద్రంగా గత కొన్ని రోజులుగా అనంతగిరి రిసార్టులో కొనసాగుతున్న ఉమ్మడి రాష్ట్ర డి సీసి ల శిక్షణ కార్యక్రమం సోమవారం ముగియడంతో ఈ కార్యక్రమానికి లోక్ సభ విపక్షనేత రాహుల్ గాంధీ హాజరైయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా కొందరు తీవ్రంగా స్పం దించారు. పి వో డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి వై గీత, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా అధ్యక్షుడు వై మహేందర్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, ఏమ్మార్పీ ఎస్ జిల్లా యకురాలు వై పుష్ప రాణి, కె సునిత లను ఉదయం 6 గంటల నుండి అరెస్టు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అరెస్టు అయిన నాయకులు మాట్లాడుతూ దేశంలో బిజెపి విధానాలతో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని, బహుళ భాషలు, సంస్కృతులు, మతాలు ఉన్న దేశంలో అందరి గొంతు వినిపించే అవకాశం కావాలని రాజ్యాంగాని రక్షించాలని దేశం లో ప్రజాస్వామ్య రక్షణ, రైతు,కార్మిక నల్ల చట్టాలు, కార్పొరేట్ వ్యవసాయం, ఉద్యోగ అవకాశాలు, డేటా భద్రత, అమెరికాతో ట్రేడ్ డీల్ విషయాలపై మాట్లాడుతున్నారు.అదే విషయాల మీద నిరంతరం పోరాడే కమ్యూనిస్టులను రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా అరెస్ట్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కోసం ప్రభుత్వం భూములను అడవులను అప్పజెప్తూ జరిపే బుల్డోజర్ పాలన పై రాహుల్ గాంధీ పోరాడతరు కానీ తెలంగాణ రాష్ట్రంలో ఏమి జరుగుతొందో తెలుసుకోరాని, తెలంగాణ ప్రజలు భయం తో బ్రతుకుతున్నారని ఏ రాత్రి వాళ్ళ నివాసాలు ఏ కూల్చి వేతలకు గురైతాయో ఏ క్షణంలో వాళ్ళ ఇండ్ల మీదికి బుల్డోజర్ లు వస్తాయో అనే దుస్థితిపై స్పందించరని అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా పేదల నివాసాలు కూల్చాడు, పచ్చని అడవులు నరకుడం, అభివృద్ధి పేరుతో పేదల భూములు, ప్రభుత్వం భూములను దోచుకోవడం జరుగుతుందన్నారు. దళితుల మీద ఆదివాసీలు, మహిళల మీద దౌర్జన్యాలు ఎక్కువైనాయని రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అటవీ విధ్వంశాల పైన సమాధానం చెప్పాలని కోరారు. డెవలప్మెంట్ పేర్లతో పేదల ఇండ్లను మాత్రమే ఎందుకు కులుస్తున్నారని సమాధానం చెప్పాలని అన్నారు. కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే 4 లేబర్ కోడ్ లు వ్యతిరేస్తు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఎందుకు తీర్మానం చేయలేదు చెప్పాలన్నారు. ప్రాజెక్టుల పేరుతో పేదల భూములను, ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు ఎందుకు అప్పచెబుతున్నారో సమాధానం చెప్పాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుల పైన జరుగుతున్న దాడులను ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొని బాధితులకు న్యాయం చేయడం లేదా చెప్పాలని వారు అన్నారు.

## సభాపతి పదవికి వన్నెతెచ్చిన మహనీయుడు శ్రీపాదరావు
### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ కలెక్టరేట్, (సింగిడి)** దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో సోమ వారం కలెక్టరేట్‌లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ, శాసన సభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ (ఇంఛార్జి) చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పందిళ్ళలో రెండో విడత సీసీ కెమెరాల ప్రారంభం



**సిద్దిపేట,(సింగిడి)** హుస్నాబాద్ మండలం పందిళ్ళ గ్రామంలో రెండో విడత సీసీ కెమెరాలు హుస్నాబాద్ ఏసిపి సదానందం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాలు రెండో విడత కూడా ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది అని ఒక్క సీసీ కెమెరా 100 మంది మనుషులతో సమానమని సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పందిళ్ళ గ్రామపంచాయతీ పాలకవర్గం ఎంతో కృషి చేసింది అని అన్నారు ఈ సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల క్రైమ్ రేటును తగ్గించవచ్చుని పందిళ్ళ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని మిగతా గ్రామాలలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో పందిళ్ల గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్. హుస్నాబాద్ సిఐ శ్రీనివాస్ ఎస్ఐ లక్ష్మారెడ్డి విలేజ్ పోలీస్ ఆఫీసర్ నరేష్ గ్రామ పాలకవర్గం గ్రామస్తులు పాల్గొన్నారు.

# పవిత్ర రంజాన్ మాసంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి
## మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్లు




**చెన్నూర్,(సింగిడి)**చెన్నూర్ మున్సిపాలిటీ కమిషనర్ మరియు చైర్మన్ లకు రంజాన్ సందర్భంగా లైలతుల్ ఖదర్,ఈద్ ఉల్ ఫితర్ కు అవసరమైన సౌకర్యాల కల్పనకు వినతి పత్రం అందజేసిన మున్సిపల్ కౌన్సిలర్లు అనంతరం కౌన్సిలర్ నగ్మా అమీర్ మాట్లాడుతూ సోమవారం లైలతుల్ ఖదర్ (జాగారం) , ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా ఖబ్రస్తాన్లు , ఈద్ గాహ్ వద్ద లైటింగ్, శింద్రత, శానిటైజింగ్, త్రాగునీటి సౌకర్యాల పంపించాలని అలాగే పవిత్ర రంజాన్ మాసంలో భాగంగా తేది 16/03/2026, తేదీ సోమవారం లైలతుల్ ఖదర్ (జాగారం) నిర్వహించబడును ఆ సందర్భంగా చెన్నూర్ పట్టణ ప్రజలు రాత్రి సమయంలో ఖబ్రస్తాన్లకు వెళ్లి తమ కుటుంబ సభ్యులలో మరణించిన వారి ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా ఉంది. కావున చెన్నూర్ పట్టణంలోని 1. పాత బస్టాండ్ సమీపంలోని ఖబ్రస్తాన్ , 2. జమా మస్జిద్ సమీపంలోని ఖబ్రస్తాన్ వద్ద తగిన లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయించవలసిందిగా మున్సిపల్ కమిషనర్ కు కోరడం జరిగింది అలాగే, ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ నిర్వహించబడే ఈద్ గాహ్ వద్దా , ఈద్ గాహ్ పరిసరాప్రాంతం లో పిచ్చి మొక్కలను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రపరచి, శానిటైజింగ్, సిల్లింగ్ , టెంట్ వేయించగలరు ఎందుకు అనగా ముందు రోజులు విపరీతమైన ఎండలు ఉండును కావున సిలింగ్ , టెంట్ వేయించగలరు అదేవిధంగా అవసరమైన త్రాగునీటి సౌకర్యం కల్పించవలసిందిగా కౌన్సిలర్లు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో చెన్నూరు మున్సిపల్ చైర్మన్ పెద్దింటి పద్మ కౌన్సిలర్లు నజ్మా అమీర్ అజీమ్ మాజీ కోఆప్షన్ ఖలీల్ కాంగ్రెస్ నాయకులు అతిఫ్ తదితరులు పాల్గొన్నారు...శాంతి కోసం ప్రార్ధనలు చేయడం ఆనవాయితీగా ఉంది.

కావున చెన్నూర్ పట్టణంలోని 1. పాత బస్టాండ్ సమీపంలోని ఖబ్రస్తాన్ , 2. జమా మస్జిద్ సమీపంలోని ఖబ్రస్తాన్ వద్ద తగిన లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయించవలసిందిగా మున్సిపల్ కమిషనర్ కు కోరడం జరిగింది అలాగే, ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ నిర్వహించబడే ఈద్ గాహ్ వద్దా , ఈద్ గాహ్ పరిసరాప్రాంతం లో పిచ్చి మొక్కి లను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రపరచి, శానిటైజింగ్, సిల్లింగ్ , టెంట్ వేయించగలరు ఎందుకు అనగా ముందు రోజులు విపరీతమైన ఎండలు ఉండును కావున సిలింగ్ , టెంట్ వేయించగలరు అదేవిధంగా అవసరమైన త్రాగునీటి సౌకర్యం కల్పించవలసిందిగా కౌన్సిలర్లు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో చెన్నూరు మున్సిపల్ చైర్మన్ పెద్దింటి పద్మ కౌన్సిలర్లు నజ్మా అమీర్ అజీమ్ మాజీ కోఆప్షన్ ఖలీల్ కాంగ్రెస్ నాయకులు అతిఫ్ తదితరులు పాల్గొన్నారు.



## పులిరాజ్ గౌడ్ పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

**చింతపల్లి, (సింగిడి)**
మండలంలోని గోడుకొండ్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాదేపల్లి పులిరాజ్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ లోని లైఫ్ స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం లైఫ్ స్టార్ ఆసుపత్రిలో పులిరాజ్ గౌడ్ ను బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు,తదితరులు ఉన్నారు.

## హరిహర సుతుడు అయ్యప్ప సేవలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, (సింగిడి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 – జీడిమెట్ల డివిజన్ శ్రీ రాఘవేంద్ర కాలనీ లోని శ్రీ హరిహర క్షేత్రం అయ్యప్ప దేవా లయం ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమా నికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ హరిహ రసతుడు అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు కె. కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, సలహాదారులు మల్లేష్ గౌడ్, శ్రీకాంత్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ, ప్రధాన కార్యదర్శి ఉమాపతి, నాయకులు కుంటా సిద్దిరాములు, సుధాకర్ గౌడ్, కాలే నాగేష్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, కాలే గణేష్, బాల మల్లేష్, వేంకటేష్ నాయి, కేపీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలి
### రథయాత్రలో పాల్గొన్న బిజెపి నేత మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి





**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం అంబేద్కర్ భవన్ లో జై భీం మహాసేన ఆధ్వర్యంలో పాఠ్యాంశాలలో భారత రాజ్యాంగం చేర్చాలని రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, లక్ష్మణ్, ఎమ్ .ఎస్ వాసు, విజేందర్ రెడ్డి తదితర నాయకులతో కలిసి పాల్గొని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## అనుమానస్పద్ధస్థితిలో మహిళా మృతి

వికారాబాద్, **(సింగిడి)** అనుమానస్పస్థితిలో మహిళా మృతి చెందిన సంఘటన జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం మైతాబ్ ఖాన్‌గూడ సమీపంలో ని పులిగుట్ట వద్ద ప్రయివేట్ వెంచర్లో సోమవారంవెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం నవాబుపేట మండలం ఎత్రాజ్ పల్లికి చెందిన మీనపల్లి బాలమణి (45) గత కొన్ని సంవత్సరాలనుండి భర్తకు దూరంగా జీవనం కొనసాగిస్తుంది. ఆమె పుట్టిన గ్రామం లో ఇటీవల శివపార్వతుల బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ నేపథ్యంలో గ్రామానికి చేరుకున్న బాలమణి ఈ విధంగా అనుమానస్పదస్థితిలో మృతి చెందటం సోమవారం కళకలం రేపింది. విషయం తెలుసుకున్న ఎస్ ఐ పుండ్లిక్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితులను సమీక్షించారు. మహిళా మృతి అనుమాస్పందంగా ఉండటంతో డాగ్ స్క్వాడ్ ను పిలిపించి పరీక్షించించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు.

## బస్తీ ప్రజల మధ్య సమన్వయం
### సమస్యల పరిష్కారానికి
# దోహదపడేది కమ్యూనిటీ భవనం
### మజ్జి కార్పొరేటర్ బిజెపి నేత రావుల శేషగిరి




**కుత్బుల్లాపూర్, (సింగిడి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్ కట్ట మైసమ్మ పరిస్థితిలో నూతనంగా నిర్మించిన బస్తీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి బిజెపి నాయకులు, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి ముఖ్య అతిథిగా హాజరై కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ ప్రజల మత్య సమన్వయం, సమస్యల పరిష్కారానికి, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఈ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కట్ట మైసమ్మ బస్తీలోని ప్రజలందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉంటూ బస్తీ అభివృద్ధికి దోహదపడాలని రావుల శేషగిరి సూచించారు. బస్తీ అభివృద్ధికి కమిటీ సభ్యులు అనునిత్యం ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడాలని వివరించారు.ఈ కార్యక్రమంలో పిట్ల మల్లేష్, పీట్ల మధు,అంబధాస్, నవీన్, భాస్కర్, మహేందర్ రెడ్డి, శ్రీకాంత్ ,హనుమంతు నాయక్, శ్రీకాంత్ నాయక్ ,కాజా, తిమ్మప్ప, లక్ష్మి, మల్లారెడ్డి, శ్రీను ,అబ్దుల్ ఖాన్, ఎండి అబ్దుల్ కలాం, రాజు, పులిగప్ప దినేష్ ,అంజిరెడ్డి, యాలప్ప, జయన్న ,తిమ్మన్న, పరుశురాం, ప్రసాద్, శివకుమార్, గోపాల్, సంగమేష్, ప్రశాంత్ బస్తీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకల్లో
## పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



**చింతపల్లి, ((సింగిడి)** మండలంలోని గొడుకొండ్ల గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కంకణాల రాజేశ్వర్ రెడ్డి, స్రవంతి ల కుమార్తె ల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి, పాల్గొని చిరంజీవులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దంత చంద్రశేఖర్ రెడ్డి, గడ్డం శేఖర్ గౌడ్, సుధాకర్ చారి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఖానాపురం పిహెచ్‌సీలో వైద్య శిబిరం ఏర్పాటు



**నర్సంపేట, (సింగిడి):** ఖానాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు శుక్రవారం నర్సంపేట మెడికల్ కాలేజీ స్పెషలిస్ట్ వైద్యులచే మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ జ్యోతి డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక వైద్యులు జనరల్ మెడిసిన్ , ఆర్థోపెడిక్, చిన్నపిల్లల వైద్యులు, స్త్రీ వైద్య నిపుణులు ,కంటి వైద్యులు ,డెంటల్ వైద్యులు, బృందం చే మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నందున మండల ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న మెగా వైద్య శిబిరం గురించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి క్యాంపు ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలు స్పెషలిస్ట్ వైద్యుల సేవలు పొందాలని కోరారు. క్యాంపును విజయవంతం చేయాలన్నారు. బుధరావుపేట పరిధిలోని జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు సందర్శించారు. జ్యోతిబాపూలే స్కూల్ ఆర్ బిఎస్‌కే విద్యార్థులకు స్పెషల్ వైద్యుల బృందం చే వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు మరియు ఆరోగ్య విద్య బోధించడం మరియు అవసరమైన వారిని రెఫెరల్ సర్వీస్ కోసం పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కళాశాల ప్రిన్సిపాల్ అనితకుమారి, ఆఫీసర్ రాజయ్య ,హెల్త్ సూపర్‌వైజర్ దామోదర్ రెడ్డి ,డేటాకంప్యూటర్ ఆఫీసర్ శ్రీనివాస చారి , నర్సింగ్ ఆఫీసర్ దివ్య ,సబిత, హెల్త్ అసిస్టెంట్ లు భాస్కర్, రాంప్రసాద్ రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు చెక్కలపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

### నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం



**నల్లబెల్లి, (సింగిడి):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని మూడు చెక్కలపల్లి గ్రామానికి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ సపావట్ కవిత దేవ్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు గురువారం నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి ఇప్పటివరకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత దేవ్ నాయక్ మాట్లాడుతూ, మూడు చెక్కలపల్లి గ్రామం నుంచి నర్సంపేట, నల్లబెల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, రైతులు ప్రతిరోజూ రవాణా సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలు, కాలేజీలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అత్యవసర పనుల కోసం కూడా గ్రామ ప్రజలు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు.గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మూడు చెక్కలపల్లి గ్రామానికి నర్సంపేట నుంచి బస్సు సర్వీసును వెంటనే ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. సమస్యను సానుకూలంగా పరిశీలించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని డిపో అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇస్లావత్ స్వరూప, నెహ్రూజీ నాయకులు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బానోతు శ్రావణ్ కుమార్, గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల చెరువు చేపల సొసైటీని స్థానిక గిరిజనులకు కేటాయించాలి



**అశ్వాపురం, (సింగిడి):** అశ్వాపురం మండలంలోని ప్రసిద్ధ తుమ్మల చెరువు చేపల సొసై టీని స్థానిక గిరిజనులకు కేటాయించాలని ఉమ్మడి తుమ్మలచెరువు గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ వంకా సత్యనారా యణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ సొసైటీ గిరిజనుల పేరుపై ఉన్నప్పటికీ లాభాలు మాత్రం బినామీ కాంట్రాక్టర్లకు చేరుతున్నా యని విమర్శించారు. తుమ్మల చెరువు మెజారిటీ ప్రాంతం ఏజెన్సీ పరిధిలో ఉన్నప్పటికీ అక్కడి గిరిజనులకు ఎలాంటి ఉపాధి అవకాశాలు లభించడం లేదని అన్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సొసైటీలో ప్రస్తుతం చాలా మంది సభ్యులు లేరని, కొందరు రాష్ట్ర విభజన తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని తెలిపారు. ప్రస్తుతం చెరువును కాంట్రాక్టర్లకు అప్పగించి వారు చేపల వ్యాపారం నిర్వహిస్తున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు గిరిజనులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వాలు చేపల పెంపకానికి సొసైటీలకు సహకారం అందిస్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం బినామీ గుత్తేదారుల ద్వారా నిర్వహణ జరుగుతోందని పేర్కొన్నారు. స్థానిక గిరిజన యువకులకు శిక్షణ ఇచ్చి తుమ్మల చెరువులో చేపల పెంపకాన్ని వారికి అప్పగిస్తే ఉపాధి అవకాశాలు పెరిగి వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని అన్నారు. ఇప్పటికైనా మత్స్యశాఖ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి బినామీ సంస్కృతిని నిలిపివేసి తుమ్మల చెరువు చేపల సొసైటీని స్థానిక ఆదివాసీ గ్రామాలకు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

### మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్



**కల్వకుర్తి, (సింగిడి)::** పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మతసామరస్యంతో పాటు హిందూ ముస్లీంల ఐక్యతను సూచిస్తాయని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్ లు పేర్కొన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీకళాశాల సమీపంలో రియల్ ఎస్టేట్ యజమాని ఫరూక్ అహ్మద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందు కార్యక్రమానికి కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బృంగిరత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్ లు ముఖ్యఅతిథులుగా హాజరై ముస్లీం సోదరుల ఉపవాస దీక్షను విరమింపజేశారు. అనంతరం కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ముస్లీం సోదరులు పవిత్ర రంజాన్ మాసాన్ని సంతోషంగా జరుపుకోవాలని అన్నారు.నెలరోజులపాటు కఠిన నియమాలతో ముస్లీం అల్లాను ప్రతినిత్యం ప్రార్థించే ముస్లీం సోదరుల భక్తి విశేషమని పేర్కొన్నారు.అల్లా దయతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఈసందర్భంగా ఆకాంక్షించారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,లతో వివిధ వార్డుల కౌన్సిలర్లకు ఫరూక్ అహ్మద్ శాలువా పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మనీలా సంజీవ్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ ఏజాస్,మక్బూల్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మసూద్,మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఖలీల్,మాజీ కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, బాలునాయక్, నాయకులు చంద్రకాంత్ రెడ్డి,ఇంతియాజ్ ఖాన్, జహీర్,ముక్తాధర్, అఖిల్, మాజీద్,గౌస్,పడకంటి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దూలుగొండ ముసలమ్మ-పగిడిద్దరాజుల జాతర

**గుండాల, (సింగిడి):** మండల కేంద్రం లోని యాపలగడ్డ గ్రామంలో అరెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజు జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. సమ్మక్క భర్త అయినటువంటి పగిడిద్దరాజు జాతర నాలుగు రోజులపాటు అరెం వంశీయులు యాపలగడ్డ గ్రామంలో నిర్వహిం చడం ఆనవాయితీగా వస్తుంది. మొదటిరోజు బుధవారం పూజారులు వడ్డెలు గర్భగుడిలోని పగిడిద్ద రాజు పురాతన కాలం నాటి ఆభరణాలు, ఈటలు, బల్లెం, పడగలు జెండాలకు శివసత్తుల ప్రత్యేక పూజలు నిర్వహించి పగిడిద్దరాజును గుట్ట నుండి తీసుకువచ్చి సమ్మక్క పగిడిద్దరాజుల ఎది రిల్లు, గుడి మెలుగుట కార్యక్రమం నిర్వహించారు. రెండవ రోజు గురువారం రోజున అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివాసి సాంప్రదాయాల నడుమ డోలిమోతలతో ఆదివాసి సాంప్రదాయ నృత్యాలతో వనం నుండి పగిడిద్దరాజును గంగ స్నానం నిర్వహించి, గద్దెల దగ్గరకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. మూడవరోజు శుక్రవారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో తమ మొక్కులను దేవతలకు సమర్పించుకుంటారు. నాలుగవ రోజు శనివారం దేవతలు వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.



దూలుగొండ ముసలమ్మ తల్లి జాతర...

మండలంలోని రోల్లగడ్డ గ్రామంలో ఈసం వంశీ యుల ఇలవేల్పు దూలుగొండ తల్లి జాతర బుధ వారం ఘనంగా ప్రారంభమైంది. దూలుగొండ తల్లి జాతర మూడు రోజులపాటు ఈసం వంశీయులు రోల్లగడ్డ గ్రామంలో నిర్వహిస్తారు. మొదటిరోజు బుధవారం పూజారులు వడ్డెలు గర్భగుడిలోని దూలుగొండ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి గుడి మెలుగుట కార్యక్రమం నిర్వహించారు.2వ రోజు గురువారం రోజున అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివాసి సాంప్రదాయాల నడుమ డోలిమోతలతో ఆదివాసి సాంప్రదాయ నృత్యాలతో దూలు గొండ తల్లిని సమీపంలోని ఊరు గుట్ట నుండి తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. 3రోజు శుక్రవారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో తమమొక్కులను దేవతలకు సమర్పించుకుంటారు. అదే రోజు సాయంత్రం దేవత వనప్రవేశం చేయడంతో జాతర ముగు స్తుంది. 3రోజులపాటు జరిగే జాతరలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారు.

## రంగాపురం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా జగ్గయ్యయాదవ్



**నర్సంపేట(సింగిడి)::** ఖానాపురం మండలం రంగాపురం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులుగా గాడుదుల జగ్గయ్యయాదవ్ ను ఎన్నుకున్నారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాఖమూరి హరిబాబు , నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రంగాపురం గ్రామంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. రంగాపురం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులుగా గాడుదుల జగ్గయ్యయాదవ్ ,ఉపాధ్యక్షులు బండి శ్రీను, కార్యదర్శి బసవ శ్యామ్,సహాయ కార్యదర్శి భూక్య సంతోష్ ,కోశాధికారి భూక్య ఫుల్ సింగ్, గౌరవ అధ్యక్షులు పిండి కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ గూగులోతు వెంకన్న, సలహాదారులుగా కందుల ఉపేందర్, భూక్య భద్ర, కత్తిబాబు, లింగాలా యాకయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఎర్రబెల్లి బలరాం, భూక్య నరసింహ, నాయకులు గూగులోతు నరేష్, మాచర్ల శ్రీను,తల్లా కొమ్మలు స్టాలిన్,జోసఫ్,కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నాయకులు,

## దళిత ఉద్యోగిపై అగ్రవర్ణాల దురహంకార దాడి..!

### దాడిపై నిరసిస్తూ బీసి,ఎస్సి,ఎస్టీ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు!

**ఆర్మూర్,(సింగిడి):** నిజామా బాద్ జిల్లా రూరల్ నియోజకవర్గం లోని దర్పల్లిమండలం హొన్నజీపేట్ గ్రామంలో దళితుడైనా ఓ ప్రభుత్వ ఉద్యోగిపై అగ్రకులస్థుడైన జీవన్ రెడ్డి,వారి కులస్థులు చేసిన దాడిని నిరసిస్తూ, గురువారం రాష్ట్ర బీసి,ఎస్సి, ఎస్టీ జేఏసీ తరపున దర్పల్లి సి.ఐ. భిక్షపతి,ఎస్ఐ సామ శ్రీనివాస్‌లకు వినతి పత్రము అందజేశారు. వివరాల్లోకి వెళ్ళితే ఈ నెల 2న బాధితుడు పాఠశాల ఉధ్యా యుడైనా గద్దల నరేందర్ తనవిధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా, మార్గ మధ్యలో హొన్నజీపేట గ్రామస్థుడైనా జీవన్ రెడ్డికి అనుకోకుండా ప్రమాదవషత్తు చిన్నపాటి ప్రమాదం జరిగిందని, ఆ నేపధ్యంలో జీవన్ రెడ్డి



కుటుంబ సభ్యులు తీవ్రంగా కొట్టి పరుశపదజాలంతో దూషించి ఇష్టం వచ్చినట్లు చితకబాదారని, బాధితుడు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి, పోలీసులు నాలుగు రోజులు గడుస్తున్నా స్పందించడం లేదని,రాష్ట్ర నాయకుల దృష్టికి బాధితుడు తీసుక వెళ్ళడంతో,పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గురువారం రోజున పోలీసు అధికారులకు మెమోరాండం అందించడం జరిగిందని అన్నారు. బాధితునిపై చెయ్యి చేసుకున్న వ్యక్తులపై అట్రాసిటీ, కేసు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి ప్రమాదమనే సాకుతో అగ్రకులస్థులకు కాపాడే ప్రయత్నం పోలీసులు చేస్తే,జిల్లా వ్యాప్తంగా ఆందోళన తీవ్రంగా చేపడ్తా మన్నారు..ఈ కార్యక్రమంలో బాగంగా బీసి,ఎస్సి, ఎస్టీ,జేఏసి రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్,జిల్లా జేఏసి ఇంచార్జ్ మహిపాల్,జిల్లా జేఏసి నాయకులు బాలయ్య, ముదిరాజ్ సుభాష్,మురళి, ఉమేష్, ధర్పల్లి మండల అధ్యక్షులు మహిపాల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## సీకేఎం కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు

**వరంగల్ (సింగిడి):** సీకేఎం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల లో పదవ బెటాలియన్ ఎన్ సీసీ వరంగల్ ఆధ్వర్యంలో షీటీం ఎస్ఐ శ్వేత, ట్రాఫిక్ సీఐ సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి మాట్లాడుతూ షీ టీం అనేది మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక పోలీస్ బృందం అని తెలిపారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు, ఈవిటీజింగ్, స్టాకింగ్ వంటి సమస్యలను తగ్గించ డానికి పనిచేస్తుందని ఈ విధమైనటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా కళాశాలలు, పాఠశాలలు మరియు ప్రజలలో మహిళల భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా మహిళలగౌరవం పెరిగి వేధింపులను నిరోధించడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్‌సిఐ సుజాత మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు ఎదుర్కొనే సమస్యలను పోలీసులకు తెలియజేయడానికి ప్రోత్సహించడం వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు ఎలా తెలియజేయాలి అని పోలీస్ హెల్ప్ లైన్.. 100 , షీ టీం నెంబర్ 1930 లేదా తెలంగాణ పోలీస్ సోషల్ మీడియా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఇదే సందర్భంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను అందరూ విధిగా పాటించాలని, మైనర్లు వాహనాన్ని నడపడం చట్టరీత్యా నేరమని, హెల్మెట్ కచ్చితంగా పెట్టుకోవాలని, ఒకే బండిపై ముగ్గురు వెళ్లకూడదని, మద్యం సేవించి వాహనాన్ని నడప కూడదని ముఖ్యంగా మేమున్నది ప్రజల కోసమేనని ప్రజల భద్రత కొరకేనని వివరించారు. ప్రతి ఒక్కటి ప్రతిరోజు అందరూ విధిగా పాటించాలని ముఖ్యంగా యువత రోడు ప్రమాదాల గురై మరణించినటువంటి వార్తలు ఎన్నో ఉదాహ రణలు ఉన్నాయని అలా తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చవద్దన్నారు. ఎస్ ఐస్వాతి ,హెడ్




కానిస్టేబుల్ నారాయణ మాట్లాడుతూ షీ టీం అవగాహన కార్యక్రమాలు సమాజంలో మహిళలకు భద్రత కల్పించడానికి చాలా ఉపయో గపడుతున్నాయి.విద్యార్థులు కూడా ఇందులో భాగస్వాములు అయితే సమాజం మరింత సురక్షితంగా మారుతోందని ఆడపిల్లలు ముఖ్యంగా వారి వాట్సప్ డీపీలో వారి యొక్క ఫోటోలు స్టేటస్లో వారి నిత్య సమాచారాన్ని వేరొకరికి తెలియజేసేటట్లు పెట్టుకోవద్దని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వరప్రసాద్, విజయ్ పాల్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ సతీష్, లైబ్రేరియన్ అనిల్, ఆయేషా, కానిస్టేబుల్ పూర్ణ, సూపరిండెంట్ శ్రీనివాస్, పాషా, జ్ఞానేశ్వర్, స్రవంతి, హరిబాబు, వెంకట్, సుమన్, చంద్రమోహన్ తదితర టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, ఎన్ సీసి ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూక పొంగ కాశయ్య మాదిగ



**మిర్యాలగూడ (సింగిడి):** దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశయ్య మాదిగ, నల్గొండ జిల్లా అధ్యక్షులు రామంజి సైదులు మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కరపత్రం విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైనందున ఈనెల 30వ తారీఖున హైదరాబాద్ ఇందిరా పార్క్ లో జరిగే విరహార దీక్షను మరియు ఈ నెల 9న కలెక్టరేట్లలో జరిగే నిరసన కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నూక పంగు కాశయ్య మాదిగ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జ్ చీమలపాటి వెంకటయ్య మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు అందుగుల లక్ష్మణ్ సుబ్బారెడ్డి గూడెం సర్పంచ్ కందుల చిన్న సైదులు జిల్లా నాయకులు నూకపంగ శ్రీనివాస్ కొండేటి మధు కొండేటి నరేష్ కొండేటి శేఖరు నూక పంగ కృష్ణయ్య పాతకోటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై సమన్వయ సమావేశం



**అశ్వాపురం, (సింగిడి):** అశ్వాపురం మండల రైతు వేదికలో గురువారం మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన లిప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలి 99 రోజుల కార్యాచరణపై మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్చి 6నుంచిజూన్ 12 వరకు 99 రోజుల పాటు 10 ప్రధాన అంశాల ఆధారంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.మార్చి 6 నుంచి 15 వరకు పారిశుధ్య కార్యక్రమాలు, ఏప్రిల్ 6 నుంచి 11 వరకు ఆరోగ్య కార్యక్రమాలు, ఏప్రిల్ 13నుంచి 18 వరకు సురక్షితంగా చేరుకోవడం, ఏప్రిల్ 20నుంచి 25 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ,ఇతర వర్గాల సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. అలాగే ఏప్రిల్ 27నుంచి మే 2వరకు పిల్లల భద్రత, రక్షణ మాదక ద్రవ్యాల నివారణ, మే 4 నుంచి 9 వరకు వ్యవసాయం, మే 11 నుంచి 16 వరకు విద్య, మే 18 నుంచి 23 వరకు యువత మరియు క్రీడలు, మే 25 నుంచి 30 వరకు మహిళా సంక్షేమం, జూన్ 1 నుంచి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి ముత్యాలరావు, తహసీల్దార్ మణిధర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో యూడీసీ పద్మావతి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహా విజ్ఞాపన సభను విజయవంతం చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి (సింగిడి):** 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని మార్చ్ 7 న ఇందిరపార్క్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మహా విజ్ఞాపన సభను విజయవంతం చేయాలనిఉపాధ్యాయుడు భూక్య రవినాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగత 20 సంవత్సరాలుగా న్యాయమైన పాత పెన్షన్ కొరకు పోరాటం చేస్తున్నప్పటికి ప్రభుత్వంలో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మెమోనెంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ ఇవ్వవచ్చని చెప్పినప్పటికి ఇవ్వడంలేదన్నారు. ఇటీవల హైకోర్టు సైతం పాత పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చినప్పటికి రాష్ట్ర ప్రభత్వం అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున అన్నీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను ఒప్పించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోవచ్చి పాత పెన్షన్ సాధించడానికి హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహావిజ్ఞాపన సభను కాటారం డివిజన్ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదయ్య, తిపిరి రాజయ్య, భూక్య మల్సూర్, ప్రభాకర్, కుత్తడి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### సిఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్.

**జమ్మికుంట, (సింగిడి):** గ్రామపంచాయతీ యూనియన్ హుజురాబాద్ మండల కమిటీ సమావేశం, ఆకునూరి సుధాకర్ అధ్యక్షతన స్థానిక హుజురాబాద్ హమాలీ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని, ఎన్నికలకు ముందు తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు నేరుగా కార్మికుల అకౌంట్లో వేస్తామని చెప్పి చెప్పిన మాటలు నేటికీ అమలు కాలేదని రెండు సంవత్సరాల కాలం పూర్తయినప్పటికీ, పంచాయతీ కార్మికులకు గతంలో ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించి నేరుగా వేతనాలు చెల్లించిందని, ఇప్పుడు కార్మికుల వేతనాలు గ్రామపంచాయతీ



పాలకవర్గాలే చెల్లించాలని రెండో తారీఖు నాడు పంచాయతీరాజ్ కమి షనర్ ఆఫీస్ నుండి సర్కిలర్ జారీ చేయడం ఇది దుర్మార్గమైన చర్యని అన్నారు. గ్రామ పంచాయతీలో ఉండేది అరకురానిధులే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుండి పంచాయతీలకు నిధులు సక్రమంగా కేటాయించపోగా కేంద్రం ఇచ్చే నిధులనుండే, పంచాయతీలలో అభివృద్ధి పనులు వివిధ ఖర్చులు మరియు కార్మికుల వేతనాలు చెల్లించాలంటే పంచాయతీలకు బడ్జెట్ సరిపోదని, ఇప్పటికే అనేక పంచాయతీలలో గత సర్పంచులు కార్యదర్శులు వివిధ రకాల ఖర్చులకోసం నిధులు ఖర్చుపెట్టి ఉన్నారని అట్టి బకాయి నిధులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోగా 15 ఫైనాన్స్ నిధులను ఉండే చెల్లించాలని, అనడం కార్మికుల జీతాలు ఇవ్వకపోవడం బాధ్యతరాహిత్యం అన్నారు.దీనిపై దశలవారీగా కార్మికులను ఐక్యం చేసి ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు.ఇప్పటికే ఒక్కొక్క గ్రామపంచాయతీలో మూడు నెలల బకాయి జీతాలు ఉన్నాయని, ఆన్లైన్లో పేర్లు నమోదు లేని కార్మికులకు ఎనిమిది నెలలు 12 నెలలు కూడా వేతనాలు పెండింగ్ ఉన్నాయని ఇలాంటి సందర్భంలో స్థానిక పాలకుల వేతనాలు చెల్లించాలని నిర్ణయం సరైంది కాదని కార్మికులను బానిసత్వంలోకి నెట్టే నిర్ణయం అని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బిక్షపతి, కమిటీ సభ్యులు, మాదుగుల ఉమా, ఎల్లయ్య, మంద లక్ష్మి, ఇమ్మడి రాజు, ఎడ్ల శ్రవణ్, అరవిందు, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసం దాతృత్వానికి నిదర్శనం

### వృద్ధాశ్రమానికి బియ్యం, పండ్లు అందజేత




**అశ్వాపురం, (సింగిడి):** రంజాన్ మాసం సందర్భంగా పినపాక మండల ముస్లిం కమ్యూనిటీ గ్రూప్ సభ్యులు గురువారం ఆరిఫా అండ్ రోషిని రీమ వృద్ధాశ్రమాన్ని సందర్శించి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు 150 కిలోల బియ్యం మరియు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షేక్ జహంగీర్ మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రతి ముస్లింకు పవిత్రమైన నెల అని, ఈ సమయంలో ఉపవాస దీక్షలు, నమాజ్ ఆచరిస్తూ దానధర్మాలు చేయడం ముఖ్యమని తెలిపారు. పేదలు, నిరాదరణకు గురైన వారికి జకాత్ రూపంలో సహాయం చేయడం ముస్లింల ధర్మమని పేర్కొన్నారు.వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులను పరామర్శించి నిత్యావసర వస్తువులు అందించడం సంతోషంగా ఉందని ముస్లిం కమ్యూనిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకురాలు షహనాజ్ బేగం అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ జహంగీర్, ఎం.డి. షంషుద్దీన్, ఎస్.డి. హుస్సేన్, మహమ్మద్ యాకూబ్ పాషా, ఎం.డి. దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## సీతమ్మ సహనం, సేవాభావం అందరికీ ఆదర్శం

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు..!





**పాలేరు (సింగిడి):** కనక బండి సీతమ్మ సహనం, సేవాభావం నేటి ప్రజలకు ఆదర్శం అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. నేలకొండపల్లి మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన కనకబండి సీతమ్మ సంస్మరణ సభ సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు,గ్రామశాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు అధ్యక్షతన గురు వారం నిర్వహించారు.వారు మాట్లాడారు. రామాయణం లో సీతమ్మ కు ఎంతో ఓపిక మనం చదువుకున్నాం కానీ ఈ కనకబండి సీతమ్మ ను 35 సంవత్సరాలగా మేము చూశాం అని పేర్కొన్నారు.సితయ్య జిల్లా నాయకుడుగా సర్పంచ్‌గా ప్రజలలో నిలవడానికి కారణం సీతమ్మ అని తెలియజేశారు. గ్రామంలో సిపిఐ నీ మేజర్ పార్టీగా నీలపటంలో సీతమ్మ సలహా, సూచనలు ప్రాముఖ్యమై నవన్నీ తెలియజేశారు.సీతమ్మ సేవలను గుర్తు చేసుకుం టూ, ఆమె ఆశయాలను నెరవేర్చా లని పిలుపునిచ్చారు. సీతమ్మ జీవితం నేటి తరానికి ప్రేరణ అని, ఆమె సేవలు ఎప్పటికీ మర్చిపోలేని తెలిపారు. సీతమ్మ కుటుంబ సభ్యు లకు సిపిఐ పార్టీ తరుపున సంతాపం తెలియజేస్తూ, ఆమె ఆశయాలను నెరవేర్చడానికి పార్టీ సదా సిద్ధంగా ఉంటుంది అని తెలిపారు ఈ కార్యక్రమంలో,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్, సిద్ధినేని కర్ణ కుమార్, ఐజేయు జిల్లా ఉపాధ్యక్షులు పొలంపల్లి నాగేశ్వరరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండల కార్యవర్గ సభ్యులు కర్నాటి నళిని రాణి, పాల్తియ శ్రీనివాసరావు, సర్పంచ్ గుండపనేని లక్ష్మణరావు, ఉప సర్పంచ్ ఆలేటీ ఉమామహేష్ గ్రామ శాఖ సభ్యులు వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన చదివే ఉన్నత స్థాయికి ఎదిగేందుకు తోడ్పడుతుంది

### ఎం.వి.రామన్ పాఠశాలలో అవగాహన సదస్సు




**అమరచింత, (సింగిడి):** స్థానిక ఆత్మకూరు పట్టణంలోని ఎం.వి. రామన్ ఉన్నత పాఠశాల (సీబీఎస్ఈ)లో గురువారం ప్రిన్సిపల్ హన్సీ శ్రీధర్ అధ్యక్షతన కెరీర్ మార్గదర్శక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఎం. శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి, పదవ తరగతి అనంతరం అభ్యసించే ఉన్నత విద్యలో రాణించి జీవితంలో స్థిరపడాలంటే సమయపాలన, క్రమశిక్షణ, విలువలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబోధ చేసిన గురువు లను ఎప్పటికీ మరవకూడదని తెలిపారు. విద్యార్థులు గురువుల మార్గద ర్శకత్వంలో ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత ఉద్యోగాలను సాధించి సమాజానికి, దేశానికి సేవ చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ధనిక్ భారత్ విద్యా సంస్థల గణిత శాస్త్ర అధ్యాప కుడు రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి అనంతరం ఇంటర్మీడియట్, ఆ తరువాత ఇంజనీరింగ్, వైద్య విద్యలో ఉన్న అవకాశాలు, భవిష్యత్తు దిశగా విద్యార్థులు చేయవలసిన కృషి గురించి వివరించారు. అలాగే భౌతిక శాస్త్ర అధ్యాపకుడు శివశంకర్ మాట్లాడుతూ ఉన్నత విద్యావకాశాలు, వాటి ప్రయోజనాలను విద్యార్థులకు సవివరంగా వివరించారు.

## కాంగ్రెస్ పార్టీతోనే సొంత ఇంటి కల సాధ్యం

### రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి.



**చెవెళ్ళ (సింగిడి):** పేదల సొంత ఇంటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర పోలీసులు బోర్డు నెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు దేవుని ఎర్రవల్లి లో హరిజన్ జంగయ్య ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబెర్ చింపుల సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డు ఉపాధ్యక్షుడు హరిజన్ శివ్వయ్య,ఏదిరే చెంద్రయ్య, బక్కయ్య, పత్తి కిష్టయ్య, జావీద్, ఏదిరే యాదయ్య, కరికె మల్లేశం, చింపుల మల్లారెడ్డి, సాకలి మల్లేష్ పాల్గొన్నారు.

## కొండగట్టులో భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభం



**మల్యాల ,(సింగిడి):** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం కొండగట్టులో గురువారం ఇన్చార్జి ఆలయ ఈవో ఎల్ రమాదేవి భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు మెండుగా ఉండటం వల్ల వేసవి కాలంలో భక్తుల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని దేవస్థానం నుంచి కొంత దాతల సహకారంతో స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఆలయంలో మజ్జిగ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఈవో ఆలయ ప్రధాన పరిసరాలు కార్యాలయంతో పాటు పారిశుభ్రత, విఐపి పార్కింగ్, టికెట్ కౌంటర్లు, ముఖ్య బుకింగ్ కేంద్రాలు, తదితర ప్రదేశాలు పరిశీలిం చారు. ఆలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించిన పరిచారిక పోస్టుల పరీక్షలో ఉత్తీర్ణులైన ముగ్గురు అభ్యర్థులు హరికృష్ణ ప్రసాద్, అరుణ్ కుమార్, గోపి, లకు ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. ఏఈఓ హరిహర నాథ్, పర్యవేక్షకులు చంద్రశేఖరు, ఆలయ సిబ్బంది, అర్చకులు ,వేద పండితులు పాల్గొన్నారు.

## 1962 సంచార పశు వైద్య సేవల పరిశీలన



**చేవెళ్ల,(సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జీవీకే ఈఎమ్ఆర్ఐ ద్వారా అమలు చేస్తున్న 1962 సంచార పశు వైద్యశాల టోల్ ఫ్రీ సేవలు మూగజీవా లకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నా యని జిల్లా మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. జిల్లాలోని చేవెళ్లలో పనిచేస్తున్న 1962 సంచార పశు వైద్యశాల వాహన సేవలను రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. భగీష్ మిశ్రా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అంబులెన్సులోని పనిముట్లు, మందులు, రికార్డులను తనిఖీ చేశారు. ప్రజల నుంచి సమాచారం అందిన వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని మూగజీవాలకు తగిన చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సేవలను సమర్థంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఎంతో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్లలో సేవలందిస్తున్న 1962 సంచార పశు వైద్యశాల సిబ్బంది పారావెట్ రాజు, పైలట్ నర్సింలు ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్, రంగారెడ్డి జిల్లా మేనేజర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు

## ముస్తఫాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

### పాల్గొన్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్.వై. థామస్



**భీమదేవరపల్లి, (సింగిడి)::** హనుమ కొండ జిల్లా భీమదేవ రపల్లి మండలంలోని ముస్తఫాపూర్‌లో గురు వారం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ జన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వై. థామస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యత ఇచ్చి, ఎలాంటి రాజకీయ పైరవీలకు తావు లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు రెంటాల రమా, మల్లయ్యలు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇల్లు మం జూరు చేసి, నిర్మాణానికి సహకరించిన కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్, ముస్తఫాపూర్ గ్రామ ఉపసర్పంచ్ మరియు ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు తాళ్ల అరవింద్ గౌడ్, మేఘన వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు సుహాసిని, మహిళ కాంగ్రెస్ నాయకురాలు స్నేహలత, మండల పంచాయతీ అధికారి నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రమణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన జేఎస్ఆర్



**భీమదేవరపల్లి(సింగిడి)::** హుస్నాబాద్ నియోజకవర్గం లోని భీమదేవరపల్లి మండలం చంటయ్యపల్లి గ్రామానికి చెందిన సీనియర్ రిపోర్టర్ ఎర్రబెల్లి వెంకట రమణ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జే ఎస్ ఆర్ పరామర్శించారు. వారు అనారో గ్యంతో మృతి చెందడం చాలా బాధాకరం అని,రమణ రెడ్డి మృతి ప్రతిక రంగానికి తీరని లోటని వారి ఆత్మ కి శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని అన్నారు. వీరి వెంట బీజేపీ నాయకులు గొల్లపల్లి వీరాచారి, నరసింహ రెడ్డి,నరేందర్ రెడ్డి,శివ,ఆంజనేయులు, రజనీకాంత్, కోల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పేదోడి సొంతింటి కల సహకారం

### నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో, భీమ్ భరత్





**చేవెళ్ల (సింగిడి):** పేదవాడి సొంతింటి కలను కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని చేవెళ్ల నియోజక వర్గం ఇంచార్జ్ ఫామిలీ భీమ్ భరత్ అన్నారు. గురువారం చేవెళ్ల నియోజకవర్గం,శంకర్ పల్లి మండల పరిధిలో చందిప్ప గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను, చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్తు, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో శంకర్ పల్లీ మండలం అధ్యక్షులు జనార్దన్ రెడ్డి ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, బద్దం కృష్ణ రెడ్డి సేవాలాల్ అధ్యక్షులు నసీరోద్దీన్ మాజీ ఎంపిటిసి అజాజ్ , కౌన్సిలర్ సమీ, డైరెక్టర్ సుధాకర్ రెడ్డి , శశికిరణ్ తౌఫిక్ , శివ అంతప్పగూడ పెంటయ్య యూత్ కాంగ్రెస్ నాయకులు సంజయ్ సీనియర్ నాయకులు , స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## గద్దల వచ్చి సొమ్ము చేసుకుంటున్నారు

### దాసోజు శ్రవణ్ కుమార్

కొండలను పిండి చేస్తున్న పట్టించుకోని అధికారులు.
మైనింగ్ విభాగం చర్యలు తీసుకోవాలి... ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.
త్రిబుల్ వన్ జీవోలు అనుమతులు ఎక్కడివి.. కార్తీక్ రెడ్డి.



**రాజేంద్రనగర్, (సింగిడి):** గద్దల వచ్చి కొండలను పగలగొట్టి సొమ్ము చేసుకున్న కాంగ్రెస్ నాయకులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ అధికారులను హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా క్రషర్లు తవ్వి లాభాలను గడుస్తున్న వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పరిధిలోని కొత్వాల్ గూడ లో జరుగుతున్న అక్రమ క్రషర్లు ఆర్ఎంసిల ఏర్పాటుపై బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆదేశాల మేరకు.. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ఎస్ ఇంచార్జ్ కార్తిక్ రెడ్డి తదితరులు గురువారం కొత్వాల్ గూడలోని క్రషర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారి దగ్గర ఉన్న అనుమతులను గురించి ఆరా తీశారు. అనంతరం వాటికి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. అనంతరం దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కొత్వాల్ గూడ లోని పలుసర్వే నెంబర్లలో బండరాలను అనుమతులు లేకున్నా రాళ్లను తోవేస్తున్నారన్నారు. కే జి ఎఫ్ సినిమా తరహా మైనింగ్ వ్యాపారం చేసి లాభాలు గడిస్తున్నారు. రాష్ట్రంలో ఎలాంటి క్రషర్లు ఆర్ఎంసీలు నడపాలన్న మైనింగ్ విభాగం నుంచి అనుమతులు పొందవలసి ఉంటుందన్నారు. కానీ ఎక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న మంత్రుల బలంతో క్రషర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...కొత్వాల్ గూడకు కూతబెట్టి దూరంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది.. కాగా ఇక్కడ ఎలాంటి మైనింగ్ తోవాకాలకు అనుమతులు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ మంత్రుల బలంతో అనుమతులు తీసుకొని క్రషర్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడపడితే అక్కడ రాఘవ కన్స్ట్రక్షన్ పేరిట అనేక అక్రమాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్పడుతున్నారని వారి అవసరానికి ఎంతటికైనా దిగజారుతున్నారని పేర్కొన్నారు ఖమ్మం జిల్లాలో ఇటీవల పేద ప్రజలపై బుల్డోజర్లను పంపించి వారిని రోడ్డుకు ఈడ్చార న్నారు. నేడు రాష్ట్రంలో వారి అవసరాలకు అనుగు ణంగా వారు నియమ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని పేర్కొన్నారు. కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ... జీవో త్రిబుల్ వన్ లో ఎలాంటి ఇల్ల నిర్మాణాలకు అనుమాతులు లేకున్నాప్పటికీ క్రషర్లకు ఆర్ఎంసిలకు అనుమతులు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. శంషాబాద్ పరిసర ప్రాంతాలను ఎవరైనా ఇండ్ల నిర్మాణాలతోపాటు ఇతర ఎలాంటి నిర్మాణాలను చేపట్టాలన్న అధికారులు సవాలక్ష అంశాలను పెట్టి వారిని తిరిగి పంపించేస్తున్నారు. అలాంటిది శంషాబాద్ పరిసర ప్రాంతాలలో ఏ విధంగా క్రషర్లకు అనుమతులు ఇస్తారని అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని క్రషర్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో మళ్లీ వస్తామని ఇక్కడ ఎలాంటి మైనింగ్ తవ్వకాలు జరపవద్దని ఆయన అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మైసయ్య కొడుకుకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.

### విశ్రాంత పోలీసు అధికారుల సంఘం డిమాండ్



**ఖమ్మం, (సింగిడి):** రిటైర్మెంట్ బకాయిలు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులకు తోడు అనారోగ్యంతో బాధపడుతూ రెండు వారాల క్రితం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొం దుతూ మరణించిన ఖమ్మంనగరానికి చెందిన విశ్రాంత ఏఆర్ఎస్ఐ కుక్కల మైసయ్య భార్య భాగ్యమ్మ బుధవారం హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించగా బుధవారంరాత్రి ఆమెను ఖమ్మం నగరానికి తీసు కువచ్చినారు. విషయం తెలుసుకొని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి,రుద్ర వెంకట నారాయణలు,కార్యనిర్వాహక సభ్యులు గురువా రం ఉదయం మైసయ్య గృహానికి వెళ్లి అభాగ్యురా లైపోయిన భాగ్యమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పిం చినారు. వారు మాట్లాడుతూ రిటైర్మెంట్ బకాయి లను మైసయ్య మరణానంతరం ప్రభుత్వం విడుదల చేసిందని,సకాలంలో ఆ డబ్బు అందక, ఆర్థిక మరియు అనారోగ్య సమస్యలతో రెండు వారాల క్రితం దంపతులిద్దరినీ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా మైసయ్య మృతి చెంది నాడని,భార్యభాగ్యమ్మ ఆరోగ్యం విషమిం చడంతో భర్త మరణానికి ముశీదే అదేరోజు హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్కు తరలించగా చికిత్స పొందుతు న్నదని, ఇటీవల భర్త మరణ వార్త తెలిసినప్పటి నుండి మనోవేదనకు గురై బుధవారం చికిత్స పొందుతూ మరణించినదని, భార్యాభర్తల అకాల మరణంతో వారి ముగ్గురు కొడుకులు అనాథలైనా రని, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారి పెద్ద కుమారుడు ప్రకాష్ (36) పరిస్థితి దుర్భ రంగా ఉందని నెలకు రూ.20 వేలు వైద్యానికి ఖర్చు అవుతుందని ఆ కుటుంబాన్ని ఆదుకోవా ల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆయనకు పరిహారంగా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని లేదా అవివాహితుడైఉండి ఏ పనీ చేయలేని అతనికి తన తండ్రి పెన్షన్ ఇప్పించాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీసు అధికారులు బోడేపూడి రాజారావు, ప్రసాదరావు, దామోదర్ రావు, కిషోర్ బాబు, ప్రభాకర్ ఇంకా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్




**నిర్మల్ ప్రతినిధి,(సింగిడి):** బస్టాండ్ లోడ్, అన్‌లోడ్ కార్మికులతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం మరియు యాజమా న్యాలు తక్షణమే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా సిపిఐ కార్యాల యంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

సమాన పనికి సమాన వేతనం – రూ. 26 వేల కనీస వేతనం

ఈ సందర్భంగా భూక్యా రమేష్ మాట్లాడుతూ.. కిరాణా షాపులు, బట్టల దుకాణాలు, సిమెంట్ షాపులు, పెట్రోల్ బంకులు మరియు హమాలీలుగా పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరా రు. 2026 సంవత్సరపు నిబంధనల ప్రకారం పెరిగిన ధరలకు అను గుణంగా ప్రతి కార్మికునికి నెలకు రూ. 26,000 కనీస వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులను కేవలం యంత్రాలుగా చూడకుండా మనుషులుగా గౌరవించాలని, వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా యాజమాన్యాలు వ్యవహరించాలని హితవు పలికారు.

**ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి**

వివిధ ప్రమాదకర పనుల్లో నిమగ్నమైన కార్మికులకు యాజమాన్యాలే పూర్తి స్థాయిలో ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని రమేష్ పేర్కొన్నారు. విధుల్లో ఉండగా ఏదైనా ప్రమాదం జరిగితే సదరు కార్మికుని కుటుంబానికి భరోసా ఇచ్చేలా చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఓనర్లపై ఉందన్నారు. కార్మికుల న్యాయబద్ధమైన హక్కుల కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. నూతన కార్యవర్గ ఎన్నిక అనంతరం కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. **జిల్లా గౌరవ అధ్యక్షులు:** భూక్యా **రమేష్,జిల్లా అధ్యక్షులు:** ఎన్. రాజేశ్వర్, **జిల్లా కార్యదర్శి:** శివకుమార్, **జిల్లా ఉపాధ్యక్షులు:** ముత్తన్న, **కోశాధికారి:** శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎస్.ఎన్. రెడ్డి, నారాయణ, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం ఉపాధి శిక్షణ



**పెద్దపల్లి (సింగిడి):** పెద్దపల్లి ప్రభుత్వ ఐ.టి.ఐ నందు పి.ఎం.కె.వి.వై,ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన క్రింద ఈ క్రింద తెలుపబడిన ట్రేడ్స్‌లలో స్వల్ప కాలిక శిక్షణకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవి.. సి.ఎన్.సి ఆపరే టర్ వి.ఎం.సి,. ఎలక్ట్రికల్ వెహికల్ సర్వీస్ లీడ్ టెక్నీషి యన్, .త్రీడి ప్రింటింగ్ ఆపరేటర్లు స్వల్ప కాలిక ట్రైనింగ్ కోర్సులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు క్రింద తెలు పబడిన ధ్రువపత్రాల ప్రతులు ,బయోడేటా సమర్పించవ లసిన, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు,కుల ధృవీకరణ పత్రం,బ్యాంక్ పాస్ బుక్,తాజా ఫోటోలు 2. కావున ఆసక్తి గల అభ్యర్థులు ప్రభుత్వ ఐ.టి.ఐ పెద్దపల్లిలో సంప్రదించ గలరు. (6303662956, 8500467552, పి.ఎం. కె.వి.ట్రైనింగ్ కొరకు ఎన్రోల్మెంట్, ఆన్లైన్ అప్లై చేయుటకు నేడు చివరి రోజు. రేపటి నుంచి క్లాసులుకాను న్నాయి. ఆధార్,ఇనబ్లేడ్ బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి అని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ తెలిపారు.

## ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్ల పంపిణీ



**కల్వకుర్తి,(సింగిడి):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా కడ్తాల్, ఆమనగల్, మాడ్గుల్,తలకొండపల్లి,కల్వకుర్తి, వెల్దండ మండలాల్లో దాదాపు 3,600 కు పైగా ముస్లిం మైనారిటీ కుటుంబాలకు ఖర్జూర పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ శాంతి, ప్రేమ, ఐక్యతకు ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ మాసం ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగిస్తుందని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు ఆత్మశుద్ధికి,ఆధ్యాత్మిక సాధనకు నిదర్శనమని తెలిపారు,ప్రతి రోజు ఉప వాసాలు ఆచరిస్తూ మనసును పవిత్రంగా ఉంచు కోవడం, ప్రేమ, కరుణ, దానం వంటి గొప్ప విలువలను ఆచరణలో పెట్టడం రంజాన్ మాసం గొప్పతనమని,ఈ పవిత్ర సమయంలో తనవంతు చిరు కానుకగా ముస్లిం మైనారిటీ సోదరులకు ఖర్జూర పండ్లను పంపిణీ చేయడం ఎంతో ఆనం దంగా ఉందని తెలిపారు,మైనారిటీ సోదరుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తనవంతు తోడ్పా టును అందిస్తానని హామీ ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసం ప్రతి ఇంట్లో ఆనందం, శాంతి, ఐశ్వ ర్యం నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులతో పాటు ఆయా మండలాల ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు,రఘు, లింగం,గణేష్, యాదయ్య, విజయ్,శ్రీపతి,శేఖర్,నాగిళ్ళ శివ,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
18-7-2026

## మృతుని కుటుంబానికి సాయం



**కల్వకుర్తి, (సింగిడి) :**
కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామానికి చెందిన మునగచెట్టి బాలస్వామి సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. గ్రామస్తుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. స్థానిక సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అధైర్య పడొద్దు మీ కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, ఉప సర్పంచ్ నిజాముద్దీన్, మాజీ సర్పంచులు దేశం వెంకట్ రెడ్డి, వటేపు కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ మదన్ మోహన్ రావు, ఎంపిటీసి మల్లేష్ యాదవ్, విజయ డైరీ చైర్మన్ శ్రీశైలం, వార్డు సభ్యులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## కలెక్టర్ జితేష్ వి పాటిల్ సేవలు మరువలేనివి: ఎమ్మెల్యే జారె

### నూతన కలెక్టర్ అంకిత్ ఎమ్మెల్యే శుభాకాంక్షలు




**దమ్మపేట, (సింగిడి) :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహించిన జితేస్ వి పాటిల్ సేవలు మరువలేనివని స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ కొనియాడారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డారని తెలిపారు. ఆయన పదవీ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక స్థానం సంపాదించారని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేసి మంచి అధికారిగా ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత పదవుల్లో సేవలందించాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా నూతన జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అంకిత్ జిల్లా ప్రజల తరపున స్వాగతం పలికారు. జిల్లా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో ప్రజాప్రతినిధులు మరియు అధికారులు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బంది మృతి

### వారి కుటుంబానికి ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, (సింగిడి) :** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన బాలస్వామి గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. గ్రామపంచాయతీ నుంచి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి మార్చాల గ్రామానికి మృతుడు బాలస్వామి వాటర్ మెన్ గా సేవలందిచారని, మంచి వర్కర్ ని కోల్పోవడం బాధాకరమన్నారు. బాలస్వామి కుటుంబానికి అన్నివేళ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రమేష్, ఉప సర్పంచ్ నిజాముద్దీన్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజావాణి.. గ్రీవెన్స్ డే

-ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ
-సమస్యల పరిష్కారానికి ఎస్.హెచ్.ఓలకు ఫోన్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు..
జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి బ్యూరో, (సింగిడి) :** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా సమస్యలతో జిల్లా



పోలీసు కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను

శ్రద్ధగా విని, సమస్యలకు సంబంధించిన అంశాలపై సంబంధిత ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకుని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, మీ సమస్యలు స్థానిక పోలీస్ స్టేషన్‌లలో పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## హోలీ సంప్రదాయ పద్ధతుల్లో సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలి

### ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి బ్యూరో, (సింగిడి) :**
పండుగను సంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులను ఉపయోగిస్తూ ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. పండుగ సందర్భంగా ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. వాహనాలపై, ఇష్టం లేని వ్యక్తులపై బలవంతంగా రంగులు లేదా రంగు నీళ్లు చల్లడం వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. బైకులపై, కార్లలో గుంపులుగా తిరుగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అట్టి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు



తప్పవని స్పష్టం చేశారు.
యువత వాహనాలు నడిపేటప్పుడు అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి శాంతిభద్రతా సమస్యలు తలెత్తకుండా సున్నిత

ప్రదేశాలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్-100, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. హోలీ అనంతరం చెరువులు, లోతట్టు ప్రాంతాలలో స్నానాలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను తరచూ గమనిస్తూ, సరైన మార్గనిర్దేశం చేయాలని, ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ రంగుల హోలీ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం నింపాలని ఆకాంక్షిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి జిల్లా పోలీసు శాఖ తరపున హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను కార్పోరేట్ సంస్థలకు దారాదత్తం.

### టియుఐహెచ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అధ్యక్షుడు ప్రవీణ్.

**జవహర్‌నగర్, (సింగిడి) :** మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను బడా కార్పొరేట్ సంస్థలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధారాదత్తం చేయడం దుర్మార్గమని 8 గంటల పని స్థానంలో 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను దోచుకోవడం కుట్రలో భాగమేనని ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అధ్యక్షుడు ప్రవీణ్ దుయ్యబట్టారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ ప్రగతి నగర్ లోని నీలం రామచంద్రయ్య భవన్లో జిహెచ్ఎంసి పిఓడబ్ల్యు అధ్యక్షురాలు లక్ష్మీబాయి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రవీణ్ హాజరై మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని వి బిజి రాం జీ పథకంగా పేరు మార్చడం తగదని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీని




125 రోజులు పని కల్పిస్తామని చెప్పడంలో నిజం లేదని పథకాన్ని దుర్వినియోగం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కుట్ర దాగి ఉన్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మనువాద సిద్ధాంతం కోసం రాజ్యాంగాన్ని అపహస్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల్లో యువతకు మహిళలకు ఉపాధి హామీ గ్యారెంటీ పథకాన్ని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, ఉమా, కనుకమ్మ, అండాలు, రాజేశ్వరి, మనమ్మ, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయం ప్రారంభం





**కుత్బుల్లాపూర్ (సింగిడి) :**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 - గాజుల రామారం డివిజన్ కట్ట మైసమ్మ బస్తి వెల్ఫేర్ అసోసియే ‌షన్ నూతన కార్యాలయాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా కాలనీ అభివృద్ధి, సంక్షేమంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఈ సంక్షేమ సంఘ కార్యాలయం



ఎంతగానో ఉపయోగపడుతుం దని, బస్తీ వాసులంతా ఐకమ త్యంతో ఉన్నప్పుడే కాలనీ అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్ర మంలో వెల్ఫేర్ అసోసియేషన్ పీట్ల మధు, గౌరవ అధ్యక్షులు అంబదాసు, ఉపాధ్యక్షులు కాజా, తిమ్మయ్య, ప్రధాన కార్యదర్శి డి. లక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎండి. కలాం, కోశాధికారి మల్లారెడ్డి కార్యదర్శి వి. శ్రీను, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, ఇమ్రాన్ బేగ్, తెలంగాణ సాయి, మూసా ఖాన్, బోయిని మహేష్, తారా సింగ్, దూలప్ప, చెట్ల వెంకటేష్, నవీన్, ప్రసాద్, శివా నాయక్, శ్రావణ్, హుస్సేన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లమ్మగుంపు పాఠశాలను సందర్శించిన సర్పంచ్ లక్ష్మీదేవి







**దమ్మపేట, (సింగిడి) : ):**
మండల పరిధిలోని తొట్టిపంపు పంచాయతీ మల్లమ్మగుంపు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ సోయం లక్ష్మీదేవి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల సమస్యలు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధి హామీ నర్సరీ సందర్శించి నర్సరిలో మొక్కల పెరుగుదల నీటి సదుపాయం, మొక్కలు యొక్క వివరాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార గ్రుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయలు తదితరులు పాల్గొన్నారు.

## ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

**భీమదేవరపల్లి, (సింగిడి) :** హనుమకొండ జిల్లా భీమదేవర పల్లి మండలంలోని ముల్కనూర్ ఆదర్శ (మోడల్) పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే తేదీని మార్చి 10 వరకు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈవిద్యా సంవత్సరానికి 6తరగతిలో 100 సీట్లకు ప్రవేశాలు కల్పించనుండగా, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మార్చి 10 లోపు ఆన్లైన్ మీసేవ కేంద్రాలు లేదా ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని తెలిపారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 19న నిర్వహించనున్నట్లు వెల్లడించా రు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ముల్కనూర్ మోడల్‌స్కూల్‌ను ప్రత్యక్షంగా సంప్రదించాలని ప్రిన్సిపాల్ విజ్ఞప్తి చేశారు.

## మున్సిపల్ ఛైర్‌పర్సన్ కు సన్మానం



**జమ్మికుంట, (సింగిడి) :** ఎల్ఐసి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ని సోమవారం ఘనంగా సన్మానించారు. ఎల్ఐసి అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ బి. సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రజాప్రతి నిధులు సమాజ సేవలో ముందుండడం అభినందనీయమని పేర్కొ న్నారు. అనంతరం ఛైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఆఫీసర్ బి. హేలు, సెక్రెటరీ ఆర్. కుమార్, అసోసియేషన్ సిబ్బంది మేకల ప్రేంకుమార్, ఎమ్. వివేక్, వి. కరుణా కర్ పాల్గొన్నారు. అలాగే ఎల్ఐసి ఏజెంట్లు ఎమ్. శ్రీనివాస్, భాస్కర్, ఏ. శ్రీనివాస్, స్వప్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా ప్రసాద్



**అమరచింత, (సింగిడి) :** అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులుగా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆ సంఘం జిల్లా రెండవ మహాసభలు ఆత్మకూరు పట్టణంలో గత రెండు రోజులుగా జరిగాయి. సోమవారం ముగింపు సమావేశంలో రాష్ట్ర నేతల సమక్షంలో ప్రసాదుని జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఆత్మకూరు పట్టణంలో జరిగిన అఖిలభారత ప్రగతిశీల వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా రెండవ మహాసభలలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులు. శ్రీను, జిల్లా కార్యదర్శి చింతలన్న జిల్లా సహాయ కార్యదర్శి బాలస్వామి, జిల్లా కోశాధికారి, గోపాల్ కమిటీ సభ్యులు భగవంతు,గట్టు మహేష్ మహేష్ వెంకట్ రాములు,టి రవి ,లక్ష్మి పుల్లన్న లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 86 మంది వార్డు సభ్యులకు శిక్షణ



**కోదాడ, (సింగిడి) : :** అనంతగిరి మండలంలోని 10 గ్రామాలకు (అనంతగిరి, అమీనాబాద్, అజ్మీర తండా, బొజ్జగూడెం తండా, చనుపల్లి, పాత్ గోల్ తండా,కొత్త గోల్ తండా, గొండ్రాయాల, ఖానాపురం, కిష్టాపురం)చెందిన 86 మంది వార్డు సభ్యులకు ఈ నెల 4 నుంచి 8 వరకు శిక్షణ తరగతులు నిర్వహించను న్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో హరిసింగ్ నాయక్ సోమవారం తెలిపారు. గ్రామ అభివృద్ధి, విధులపై సభ్యులకు అవగాహన కల్పించనున్నారు. ఎంపిక చేసిన సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

## డీసీఎం ఢీకొని ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు



**కల్వకుర్తి, (సింగిడి) :** డీసిఎం ఢీకొట్టి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన సోమవారం కల్వకుర్తి మండలం మార్చాల స్టేజి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కల్వకుర్తి మండలం మాచర్ల గ్రామానికి చెందిన చాంద్ పాషా (64), ఊరుకొండ మండలం గుండ్లగుంటపల్లి గ్రామానికి చెందిన రాములు ఇద్దరూ కల్వకుర్తి నుంచి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గుండగుండ్లపల్లి వెళ్తున్నారు. మార్గ మధ్యలో మార్చాల స్టేజి వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న ఏపీ 29 యు 2507 నెంబర్ గల డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్ కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ లో క్షతగాత్రులను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చాంద్ పాషా (64) మృతి చెందారు. తీవ్ర గాయాలైన రాములను మెరుగైన వైద్యం కోసం ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించారు. దీంతో రెండు గ్రామాలలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ కు సన్మానం



**మిర్యాలగూడ (సింగిడి) :** :మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ కుమార్ కు సోమవారం సాయంత్రం ఫర్టిలైజర్స్ అసోసియేషన్ జిల్లా, మిర్యాలగూడ కార్యవర్గం ఆధ్వర్యంలో బోకేలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శిరీష నవీన్ కుమార్ కు మిఠాయి తిని పించి, శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు తెడ్ల జవహర్ బాబు, రాష్ట్ర నాయకులు ముక్క రామ్మూర్తి, ఏచూరి శ్రీనివాసరావు, ఏచూరి లక్ష్మీనారాయణ, ఆలంపల్లి శ్రీనివాస్, అశోక్ రెడ్డి, వెంపటి శ్రీను, జయిని అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



**కోదాడ, (సింగిడి) :** కోదాడ నుంచి అనంతగిరి వెళు న్న మార్గంలో ఖానాపురం గ్రామశివారులో ఓ కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. సోమవా రం ఉదయం 9గంటల సమయంలో జరిగిన ఈ ప్రమా దంలో కాలేజీకి వెళ్తున్న విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కారు వేగంగా పొలాల్లోకి వెళ్లినప్ప టికీ, అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదని సమాచారం.

## చిన్నారి మృతికి బాధ్యులైన వారిని శిక్షించాలి



**కోదాడ,మార్చి (సింగిడి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర ఘటనలో మృతి చెందిన చిన్నారి ఆత్మశాంతికి జిల్లా కేంద్రంలోని కోదాడ మండలం పాత గుడిబండ రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఈ దాడి అత్యంత అమానుషమని, నేటి వరకు బాధ్యులైన వారిని శిక్షించకపోవడం బాధాకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రజక సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం



**అమరచింత, (సింగిడి) :** అమరచింత మునిసిపాలిటీ మాజీ కార్మికుడు జిలాని గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అమరచింత పట్టణానికి చెందిన జిలాని సుదీర్ఘకాలంగా గ్రామపంచాయతీ, మునిసి పాలిటీ విద్యుత్ కార్మికుడిగా సేవలందించారు. జిలాని పట్టణంలో ఎలాంటి సమస్య అయినా సునాయాసంగా పరిష్కరించి విద్యుత్ సరఫరా అయ్యేటట్లు చూశారని పట్టణ ప్రజలు అమితంగా అభిమానించేవారు. జిలాని మృతిని తెలుసుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వయసులో జిలాని మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అన్నారు. కుటుంబానికి తమ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అధైర్య పడొద్దని కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి రాజేందర్ సింగ్, ఆత్మకూర్ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మి, ఎస్పై రాజు, మాజీ ఎంపిటిసి తిరుమలేష్, రియాజ్, హర్ష వెంకటేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు

**అమరచింత, (సింగిడి) :** అమరచింత మునిసిపా లిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి పాఠశాల యాజమాన్యంతో కలిసి స్థానిక కాంగ్రెస్‌నాయకులు భూమి పూజ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి రాష్ట్ర పాడి పరిశ్రమల యువజన క్రీడ మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటిశ్రీహరి రూ, 9,00,000 మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులసౌకర్యార్థం కోసం మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు మండల కాంగ్రెస్‌అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శ్యామ్ కుమార్, నాయకులుజింక రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రకాశం, ముదిరాజ్ రమేష్ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలలో సత్తా చాటిన భీమదేవరపల్లి టీం



**భీమదేవరపల్లి, (సింగిడి) :** హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో పీఎం సంసద్ క్రీడా మహోత్సవంలో భాగంగా నిర్వహించిన యువజన క్రీడల్లో భీమదేవరపల్లి కబడ్డీ జట్టు సత్తా చాటి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన మొత్తం 15 జట్లు పాల్గొని ప్రతిభను కనబర్చాయి. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లలో భీమదేవరపల్లి జట్టు అద్భుత ఆటతీరుతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. కఠినమైన పోటీని ఎదుర్కొంటూ ఫైనల్ దశ వరకు చేరి రెండో స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు మార్చి 5 నుంచి 7 వరకు కరీంనగరులో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు ఎంపిక కావడం భీమదేవరపల్లి జట్టుకు గర్వకారణమని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానంలో నిలిచిన భీమదేవరపల్లి జట్టును గ్రామ సర్పంచ్, టోర్నమెంట్ నిర్వాహకులు మాచర్ల కుమారస్వామి అభినందించారు. యువత క్రీడల్లో రాణిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## పార్టీ నిర్మాణమే లక్ష్యం ..

### వికారాబాద్ శిక్షణలో వెడ్మ బొజ్జు పటేల్



**నిర్మల్ ప్రతినిధి (సింగిడి) :**
కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. వికారాబాద్‌లోని అనంతగిరి హిల్స్‌లో పది రోజుల పాటు జరిగిన 'సంఘటన్ సృజన్ అభియాన్' శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి హాజరైన రాహుల్ గాంధీ, రెండు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. సుమారు రెండు గంటల పాటు దేశ రాజకీయాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేసిన ఆయన, అనంతరం నేతల కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. జాతీయ నాయకుల సూచనలు, క్షేత్రస్థాయి పర్యటనలు తనకు గొప్ప అనుభూతినిచ్చాయని తెలిపారు. సామాజిక న్యాయం, భూమి హక్కులు, ప్రభుత్వ పథకాల అమలు వంటి పలు అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీని బొజ్జు పటేల్ కుటుంబ సభ్యులు కలిశారు. ఎమ్మెల్యేగా, డీసీసీ అధ్యక్షుడిగా పార్టీ కోసం శ్రమిస్తున్న బొజ్జు పటేల్‌ను రాహుల్ గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మరియు ఇతర కీలక నేతలు పాల్గొన్నారు.

singidinews@gmail.com



# ప్రెగ్నెన్సీతోనే రాకా షూట్‌లో దీపికా పదుకొణె

బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె వృత్తిపట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటున్నారు. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వస్తున్న 'రాకా'లో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా కోసం ప్రెగ్నెన్సీతోనే ఆమె కఠినమైన యాక్షన్ సన్నివేశాలు షూట్ చేశారని సమాచారం. గతంలో 'ఎనిమిది గంటల పని' నిబంధన తెరపైకి తీసుకొచ్చిన దీపికా.. 'రాకా' కోసం మాత్రం ఎలాంటి నిబంధనలు లేకుండా పని చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆమె రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న విషయం తెలిసిందే. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందే, 'రాకా'లో తన షూటింగ్‌ను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అటు షూటింగ్‌లో పాల్గొంటూనే తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటున్నారు. దీపిక లైఫ్‌ని ఇలా బ్యాలెన్స్ చేస్తుండడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం 2027లో విడుదల కానుంది. అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిస్తున్నారు. అల్లు అర్జున్‌తో దీపికా పదుకొణె తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటుండటంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.



సినిమా సింగిడి
Cinma Singidi

శనివారం
18-7-2026



# కియారాపై ట్రోల్స్.. బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టాక్సిక్ లోని 'తబాహి' వీడియో పాటపై ట్రోల్స్ వచ్చాయి. యశ్, కియారా మధ్య ఉన్న రొమాంటిక్ సన్నివేశాలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. యశ్‌ను ప్రశంసిస్తూ.. కియారాను విమర్శించ డంపై 'టాక్సిక్'లో నటిస్తోన్న బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యశ్ అద్భుతంగా కనిపించాడం టూ కామెంట్ సెక్షన్‌లో ఎమోజీలతో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ కియారా విషయానికి వస్తే, ఆమెను దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. 'పెళ్లి అయ్యాక కూడా ఇలాంటి సన్నివేశాల్లో నటించడం అవసరమా' అని మాట్లాడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం?.
యశ్‌కు కూడా పెళ్ల యింది.. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేవలం నటీమణులపైనే ఎందుకు ఇంత దారుణంగా ట్రోలింగ్ జరుగుతోంది? వాస్తవాన్ని గ్రహించండి. వారు నటీన టులు. స్క్రీన్‌పై పాత్రలను పండించడం, కథకు తగ్గట్టుగా నటించడమే వారి పని' అని అన్నారు.

## సమంతకు సర్‌ప్రైజ్

# సీమంతం


టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు



హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి,
స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శు భాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# డిఫరెంట్ కాన్సెప్ట్ కథ.. ఓ ...సుకుమారి

ఈ వారం ప్రేక్షకులకు వినోదం పంచడానికి వచ్చిన చిత్రం 'ఓ..! సుకుమారి'. కథాబలమున్న సినిమాలతో ప్రయాణం చేసే తిరువీర్ కథానాయకుడు కాగా.. ప్రముఖ కథానాయిక ఐశ్వర్య రాజేశ్ ఆయనతో జోడీ కట్టడం, ప్రచార చిత్రాలూ, సినిమాలోని కాన్సెప్ట్ ప్రేక్షకుల్ని ప్రముఖంగా ఆకర్షించిన అంశాలు. యాదగిరి అలియాస్ యాది (తిరువీర్) పెళ్లికి సిద్ధమవుతాడు. పక్క ఊరిలోని ఓ అమ్మాయిని చూడటానికి వెళ్లి దామిని (ఐశ్వర్య రాజేశ్)పై మనసు పడతాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఆ ఊళ్లో కూడా ఎలాగైనా దామినికి పెళ్లి చేసి సాగనంపాలనేది గ్రామస్తుల ప్లాన్. దానికి కారణం ఆమెకొక విచిత్రమైన సమస్య ఉండటమే. ఆమెను ముట్టుకోగానే షాక్ కొడుతుంది. ఆ సమస్య వల్ల ఊళ్లో వాళ్లు చాలా రకాలుగా ఇబ్బందులు పడుతుంటారు. అందుకే యాది ఇష్టపడటమే ఆలస్యం... ఆ ఊరంతా కలిసి దామిని పెళ్లిని ఘనంగా చేసి సాగనంపుతుంది. అసలు చిక్కులు ఆ తర్వాతే మొదలవుతాయి. ముట్టుకుంటేనే షాక్ కొట్టే దామినితో యాదగిరి కాపురం ఎలా చేశాడు? అత్తారింట్లో దామిని ఎలా కలిసిపోయింది? ఆమెకున్న షాక్ సమస్యని తన భర్త ఊరి జనాలు ఎప్పుడు ఎలా తెలుసుకున్నారు?యాది పెళ్లి చేసుకోవాలనే నిర్ణయం వెనకున్న బలమైన ఆ కారణాలేమిటి?తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే. తిరువీర్ ఇటీవల నటించిన 'పాపం ప్రతాప్'లో కథానాయకుడి పాత్రకు సమస్య ఉంటుంది. అది కూడా భార్యాభర్తల మధ్య కాపురానికి సవాల్‌గా నిలిచిన సమస్యే. ఇందులోనేమో కథానాయికకి సమస్య. ఈ రెండూ కూడా గ్రామీణ నేపథ్యంతో సాగే కథలే. మరికొన్ని సారూప్యతలూ కనిపిస్తాయి. ముట్టుకోగానే షాక్ కొట్టే ఓ అమ్మాయి... అది తెలియక ఆమెని పెళ్లి చేసుకున్న ఓ అబ్బాయి... ఆ ఇద్దరి మధ్య కలిసి కాపురం ఎలా సాగించారన్నది ఆసక్తిని రేకెత్తించే విషయమే. నాయకానాయికలు, నిర్మాతలు వినగానే సినిమా చేయడానికి ఒప్పుకొనేలా ప్రేరేపించే కథాంశమే ఇది. కథానాయికకి ఉన్న సమస్య ప్రపంచంలోనే ఒకరిద్దరికి మాత్రమే ఉన్న అరుదైనదని చెప్పారు. అలాంటప్పుడు ఆ సమస్యతో అంతగా కనెక్ట్ కాలేము. పోనీ, అరుదైన సమస్య కదాని సీరియస్‌గా ఏమైనా దాని గురించి చర్చించారా? అంటే అదీ లేదు. షాక్ సమస్య ఎందుకు వచ్చిందో చెప్పారు కానీ, చివరిలో ఎందుకు రాదో చెప్పలేదు.



# 3 ఇడియట్స్‌తో సోనమ్‌కు సంబంధం లేదు

స్టార్ హీరో ఆమిర్ ఖాన్ తాజాగా '3 ఇడియట్స్' సినిమాపై ఎన్నాళ్లుగానో ప్రచారంలో ఉన్న అపోహకు తెరదించారు. ఆ సినిమాలో ఆయన పోషించిన 'రాంచో' పాత్రను లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆమిర్ ఖాన్, తన కెరీర్‌లో మైలురా యిగా నిలిచిన 'లగాన్' చిత్రం 25 ఏళ్ల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రేక్షకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా '3 ఇడియట్స్' సినిమాలోని రాంచో పాత్ర, సోనమ్ వాంగ్‌చుక్ మధ్య ఉన్న సంబంధంపై ప్రశ్నలు ఎదురవగా, ఆమిర్ పూర్తి వివరణ ఇచ్చారు. రాంచో పాత్రను సోనమ్ వాంగ్‌చుక్‌ను దృష్టిలో పెట్టుకుని రాశారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఆమిర్ స్పష్టం చేశారు. '3 ఇడియట్స్' సినిమా రూపొందించే సమయంలో మాకు సోనమ్ వాంగ్‌చుక్ గురించి అసలు తెలియదు. ఆ పాత్రకు ఆయన జీవితానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇటీవల సినిమాలో 'చతుర్ రామలింగం' పాత్ర పోషించిన నటుడు ఓమి వైద్య చేసిన వ్యాఖ్యలను కూడా ఆమిర్ ప్రస్తావించారు. కానీ అది సరైన సమాచారం కాదు. బహుశా అతను అలా భావించి ఉండొచ్చు. కథ రచయితలు రాజ్‌కుమార్ హిరాణీ, అభిజాత్ జోషి, తనకు ఎవరికీ ఆ సమయంలో సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదు అని స్పష్టం చేశారు. సినిమా పాత్రకు సంబంధం లేకపోయినా, సమాజం కోసం సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని ఆమిర్ కొనియాడారు.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090